

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575



www.rajamudranews.com

అక్షర
# రాజముద్ర

ప్రతి అక్షరం - ప్రజల కోసం | తెలుగు దిన పత్రిక

AKSHARA RAJAAMUDHRA | RNI No: TELTEL/2024/86684

| మేడ్చల్-మల్కాజ్‌గిరి | శనివారం | 03.01.2026 | సంపుటి : 2 | సంచిక :328 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | Saturday | 03.01.2026 | volume : 2 | Issue : 328 | Pages : 8 | Cost : 2/- |



## విలేకరులు కావలెను

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9182 474 575


## మూసీ పునరుజ్జీవంతో
# హైదరాబాద్‌కు కొత్తరూపు

### గోదావరి జలాలతో నిరంతరంగా ప్రవాహం



మూసీ పరివాహకంలో నైట్ బజార్‌ల అభివృద్ధి

నిర్వాసితులకు పక్కా ఇళ్లు కట్టించి ఇస్తాం

మూసీ పొడవునా ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణం

అంతర్జాతీయ కన్సల్టెంట్లతో ప్రణాళికలు

డిపిఆర్ సిద్ధం కాగానే ఎమ్మెల్యేలకు వివరణ

కొందు కావాలనే మూసీ అభివృద్ధిని అడ్డుకుంటున్నారు

అసెంబ్లీలో మూసీ అభివృద్ధిపై సిఎం రేవంత్ వివరణ

**మూసీ పునరుజ్జీవనంతో హైదారబాద్ ఖ్యాతిని మరింత పెంచడంతో పాటు, మెరుగైన నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని సిఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. మూసీ పొడువునా గోదావరి నీటిని పారించి సుందరంగా తీర్చిదిద్దే కార్యక్రమం చేపట్టామని అన్నారు. ఈ క్రమంలో నిర్వాసితులకు పునరావసం కూడా కల్పిస్తామని అన్నారు. నిజాం ఎంతో ముందుచూపుతో మూసీ పొడవునా మంచి కట్టడాలు కట్టి ఆదర్శంగా నిలిచారని అన్నారు.**

హైదరాబాద్,జనవరి 2 : నిజాంలు నిర్మించిన ప్రాజెక్టులే హైదరాబాద్ ప్రజల దాహార్తిని తీరుస్తున్నాయని అన్నారు. గతంలో జలవనరులను కాపాడుకొనే ప్రయత్నాలు జరగలేదని విమర్శించారు. మూసీ ప్రక్షాళనపై అసెంబ్లీలో జరగిని చర్చలో

-మిగతా 2 లో..



## ఇంటర్ బోర్డు కీలక నిర్ణయం

### తల్లిదండ్రులకు వాట్సాప్‌లో హాల్ టిక్కెట్లు

హైదరాబాద్, జనవరి 2 : ఇంటర్మీడియట్ విద్యార్థులకు ప్రయోజనకరంగా ఉండేందుకు తెలంగాణ ఇంటర్ బోర్డు కీలక నిర్ణయం తీసుకుంది. ఇంటర్ పరీక్షల హాల్‌టికెట్లను విద్యార్థుల తల్లిదండ్రుల వాట్సాప్‌కి పంపనున్నట్టు ఇంటర్ బోర్డు అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 25 నుంచి పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో 45 రోజుల నుంచి రెండు నెలల ముందే తల్లిదండ్రుల వాట్సప్‌నకు వారి పిల్లల హాల్‌టికెట్లను పంపనున్నారు. తద్వారా హాల్ టికెట్‌లో తప్పొప్పులను ముందే గుర్తించే అవకాశం

-మిగతా 2 లో..

## సభలో మాట్లాడనీయకుండా
# మైక్ కట్ చేస్తారా

### స్పీకర్ తీరుపై హరీష్ రావు అసహనం

అసెంబ్లీ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వాకౌట్

గన్ పార్క్ వద్ద ధర్నా..ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు



**శాసనసభ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వాకౌట్ చేశారు. సీఎం మాట్లాడిన తర్వాత సభలో మాట్లాడేందుకు, నిరసన తెలిపేందుకు అవకాశం ఇవ్వడం లేదని ఆ పార్టీ ఎమ్మెల్యేలు ఆరోపించారు. సభలో ప్రభుత్వం పెట్టే బిల్లులపై చర్చకు దూరంగా ఉండాలని నిర్ణయించారు. ఎమ్మెల్యేల ప్రవేశద్వారం వద్ద వారు ఆందోళనకు దిగారు. స్పీకర్ ప్రసాద్‌కుమార్ పక్షపాతంతో వ్యవహరిస్తున్నారంటూ నినాదాలు చేశారు.**

హైదరాబాద్, జనవరి 2 :అనంతరం గన్‌పార్క్ వద్దకు వెళ్లి అక్కడ బైఠాయించి నిరసన తెలిపారు. సభలో సభ్యులకు సమాన హక్కులుంటాయని.. వాటిని స్పీకర్ కాపాడాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. ఏడు రోజుల సభ నిర్వహణపై బీఏసీలో చర్చకు రాలేదని చెప్పారు. సభలో చర్చించే అంశాలను 24

-మిగతా 2 లో..

## ఆటోమేటిక్ డ్రైవింగ్
# టెస్టింగ్ స్టేషన్స్ ఏర్పాటు

గూడ్స్ వాహనాలపై 7.5 శాతం లైఫ్ టాక్స్

వాహనసారథిలో చేరిన తెలంగాణ రాష్ట్రం

మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి

**తెలంగాణ రాష్ట్రంలో మోటారు వాహనాల పన్ను విధానంలో మార్పులు చోటు చేసుకున్నాయి. శుక్రవారం రవాణా శాఖలో తెలంగాణ మోటారు వాహనాల పన్ను సవరణ చట్టంపై శాసన సభలో చర్చ జరిగింది. ఈ చర్చలో భాగంగా రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడారు. 4 వీలర్ తేలికపాటి గూడ్స్ వాహనాలకు త్రైమాసిక టాక్స్ ఉండేదని ప్రస్తావించారు. రవాణా శాఖ నిపుణులతో చర్చించి గూడ్స్‌కి సంబంధించిన వాహనాలపై లైఫ్ టాక్స్ విధిస్తూ 7.5 శాతానికి అమలు చేశామని వివరించారు.**




హైదరాబాద్, జనవరి 2 :ఇది కొత్తగా రిజిస్టకనేషన్ అయ్యే వాహనాలకు మాత్రమే వర్తిస్తుందని స్పష్టంచేశారు. త్వరలో ఢిల్లీ మాదిరిగా ఆటోమేటిక్ డ్రైవింగ్ టెస్టింగ్ స్టేషన్స్‌ను ఏర్పాటు చేస్తామని తెలిపారు. డ్రైవింగ్ స్కూల్స్‌పై కూడా ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తున్నామని వివరించారు. కేసీఆర్

-మిగతా 2 లో..

## నెలాఖరులో నోటిఫికేషన్?

ఫిబ్రవరిలో మున్సిపల్ ఎన్నికలు

మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ వెల్లడి



హైదరాబాద్,జనవరి2 : ఈ నెలాఖరు కల్లా మున్సిపాలిటీల నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉందని మున్సిపల్ ఎన్నికలపై మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఫిబ్రవరిలో మున్సిపల్ ఎన్నికలు జరిగే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. శుక్రవారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో చిట్‌చాట్ చేశారు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్. గత రెండు సంవత్సరాలుగా బీఆర్ఎస్ నేతల వ్యవహార శైలి చూస్తున్నామని.. వారి పంతం నెగ్గించుకోవడానికి ఏమైనా చేస్తారని


-మిగతా 2 లో..

## తెలుగు రాష్ట్రాల మధ్య
# జలవివాదల పరిష్కారం

### ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసిన కేంద్రం..

ఇరు రాష్ట్రాల అధికారులకు కమిటీలో చోటు

**తెలుగు రాష్ట్రాల మధ్య దశాబ్ద కాలంగా కొనసాగుతున్న నదీజలాల వివాదాలకు ముగింపు పలికే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక అడుగు వేసింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య జల జగడాలను పరిష్కరించేందుకు కేంద్ర జలశక్తి శాఖ ఒక ఉన్నత స్థాయి కమిటీని నోటిపై చేస్తూ నిర్ణయం తీసుకుంది. కేంద్ర జలసంఘం చైర్మన్ నేతృత్వంలో పనిచేసే ఈ కమిటీలో ఇరు రాష్ట్రాల జలవనరుల శాఖకు చెందిన అత్యున్నత స్థాయి అధికారులు సభ్యులుగా ఉండనున్నారు.**



న్యూఢిల్లీ, జనవరి 2 : గత 11 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను సహకార సమాఖ్య స్ఫూర్తితో పరిష్కరించడమే ఈ కమిటీ ప్రధాన లక్ష్యం. ఈ కమిటీ కూర్పును పరిశీలిస్తే, ఇందులో రెండు రాష్ట్రాల నుంచి కీలక ప్రతినిధులకు చోటు కల్పించారు. తెలంగాణ ప్రభుత్వం నుంచి జలవనరుల శాఖ సలహాదారు, ఇరిగేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ, ప్రభుత్వ స్పెషల్ సెక్రటరీ మరియు ఇంజనీర్-ఇన్-చీఫ్ సభ్యులుగా వ్యవహరిస్తారు. అదేవిధంగా

-మిగతా 2 లో..



## నేటి చికెన్ ధరలు

| | |
|---|---|
| పారం ధర లైవ్ బర్డ్ | 150 (కిలో) |
| రిటైల్ లైవ్ బర్డ్ | 177 (కిలో) |
| డ్రెస్డ్ స్కిన్‌తో | 257 (కిలో) |
| స్కిన్ లెస్ | 292 (కిలో) |

12 గుడ్ల రిటైల్ ధర ₹88




## ఆన్‌లైన్ గేమ్‌లకు బానిసయి
# అప్పులపాలు

### తట్టుకోలేక మరో యువకుడు ఆత్మహత్య

కామారెడ్డి, జనవరి 2 : ఆన్‌లైన్ గేమ్‌ల వ్యసనం కారణంగా మరో యువకుడు బలయ్యాడు. కామారెడ్డి జిల్లాలోని ఓం శాంతి కాలనీకి చెందిన శ్రీకర్(30) అనే యువకుడు ఆన్‌లైన్ గేమ్‌లో

-మిగతా 2 లో..

## కవిత కెసిఆర్ వదిలిన బాణమే

అందులో అనుమానం లేదన్న కోమటిరెడ్డి

సిఎం రేవంత్ అంటే అభిమానమని వ్యాఖ్య



హైదరాబాద్, జనవరి 2 : తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. కేసీఆర్ వదిలిన బాణం కవిత అని ఆయన

-మిగతా 2 లో..

## రేవంత్ భాష తీరు దారుణం

### కేసీఆర్ అసెంబ్లీకి రావాల్సిందే

కేసీఆర్‌ను ఉరి తీయాలంటారా?

అలా అయితే రేవంత్‌ను పదిసార్లు ఉరితీయాలి

హరీష్ రావు బబుల్ షూటర్ మాత్రమే

మీడియాతో చిట్‌చాట్‌లో కవిత సంచలన వ్యాఖ్యలు



హైదరాబాద్, జనవరి 2 : తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత రాజకీయంగా మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. అసెంబ్లీ సమావేశాలకు బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రాకపోవడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. అలాగే పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్ట్‌ను పక్కన పెట్టిన కేసీఆర్‌ను ఉరి తీయాలంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై కవిత తీవ్రంగా స్పందించారు. కేసీఆర్ మీద సీఎం భాష సరికాదన్నారు. కేసీఆర్‌ను

-మిగతా 2 లో..



# తెలుగు రాష్ట్రాల మధ్య జలవివాదాల పరిష్కారం

(మొదటిపేజీ తరువాయి)

ఆంధ్రప్రదేశ్ తరపున జలవనరుల శాఖ స్పెషల్ సెక్రటరీ, శాఖ సలహాదారు, ఇంజనీర్–ఇన్–చీఫ్ (ఇరిగేషన్) మరియు చీఫ్ ఇంజనీర్లు ప్రాతినిధ్యం వహిస్తారు. వీరితో పాటు కృష్ణా నది యాజమాన్య బోర్డు, గోదావరి నది యాజమాన్య బోర్డు చైర్మన్లు, నేషనల్ వాటర్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ మరియు అచిఅ చీఫ్ ఇంజనీర్లు కూడా ఈ కమిటీలో భాగస్వామ్యులై సాంకేతిక అంశాలను పర్యవేక్షిస్తారు. ఈ కమిటీ ఏర్పాటుకు బీజం జూలై 2025లో ఢిల్లీలో జరిగిన అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో పడింది. కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ నేతృత్వంలో జరిగిన ఆ సమావేశంలో ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు పాల్గొని తమ అభ్యంతరాలను, వివాదాలను ప్రస్తావించారు. ఆ చర్చల ఫలితంగానే, సమస్యలను సాంకేతికంగా పరిశీలించి పరిష్కార మార్గాలను సూచించేందుకు ఉమ్మడి కమిటీ అవసరమని భావించారు. ఇందుకోసం ఇరు రాష్ట్రాలు తమ ప్రతినిధులను నామినేట్ చేయాలని కోరగా, డిసెంబర్ 2025లో తెలంగాణ ప్రభుత్వం తన నామినేషన్లను పూర్తి చేసింది. దీంతో కేంద్ర ప్రభుత్వం తాజాగా ఈ కమిటీని అధికారికంగా నోటిఫై చేసింది. కృష్ణా జలాల పంపిణీకి సంబంధించి గతంలో ఏర్పాటు చేసిన కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్–2 గడువును కూడా కేంద్రం 2026 జూలై వరకు పొడిగించి, వివాదాల పరిష్కారానికి నిరంతర సహకారాన్ని అందిస్తోంది. ఏపీ పునర్విభజన చట్టం 2014లోని సెక్షన్ 84 ప్రకారం ఏర్పడిన అపెక్స్ కౌన్సిల్ నిర్ణయాల మేరకు, ఇప్పుడు ఏర్పాటైన ఈ నూతన కమిటీ క్షేత్రస్థాయిలో ఉన్న జలవివాదాలను లోతుగా అధ్యయనం చేయనుంది. ఈ కమిటీ రాకతో గోదావరి, కృష్ణా నదీ జలాల వినియోగంపై నెలకొన్న సందిగ్ధత తొలగిపోయి, రెండు రాష్ట్రాల రైతులకు మేలు జరుగుతుందని భావిస్తున్నారు. కృష్ణా, గోదావరి నదుల నీటి పంపకాలపై తెలుగు రాష్ట్రాల మధ్య సుధీర్ఘకాలంగా వివాదం కొనసాగుతున్నది. ఈ వివాదం పరిష్కారం కోసం మరో ప్రయత్నంగా కేంద్ర జలసంఘం ఒక కమిటీని నియమించింది. కేంద్ర జలసంఘం ఛైర్మన్ నేతృత్వంలోని ఈ కమిటీని వేసింది. ఈ కమిటీని నోట్గి÷ చేస్తూ కేంద్ర జల్‌శక్తి శాఖ ఇవాళ ఉత్తర్వులు జారీచేసింది.

# జలవివాదాల పరిష్కారానికి చొరవ

## కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెల్లడి

**హైదరాబాద్, జనవరి 2 :** జల వివాదాల పరిష్కారానికి కేందప్రభుత్వం సంపూర్ణ సహకారం అందజేస్తుందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. తెలుగు రాష్ట్రాల మధ్య జలవివాదాల పరిష్కారానికి ఓ కమిటీని ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. ఆ కమిటీని కేంద్ర జల్‌శక్తి మంత్రిత్వశాఖ నోటిఫై చేసిందని తెలిపారు. కేంద్ర జల వనరుల సంఘం చైర్మన్ నేతృత్వంలో ఈ కమిటీ పని చేస్తోందని స్పష్టం చేశారు. ఈ కమిటీలో సభ్యులుగా తెలుగురాష్ట్రాల ఇరిగేషన్ అధికారులు ఉన్నారని వివరించారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు కిషన్‌రెడ్డి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య నదీజలాల వినియోగంలో నెలకొన్న వివాదాల పరిష్కారానికి సంబంధించిన కమిటీని ఇవాళ కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ నోట్గి÷ చేసిందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం.. సహకార సమాఖ్య విధానంతో.. గత 11 ఏళ్లుగా తెలుగు రాష్ట్రాల మధ్య నెలకొన్న జలవివాదాల పరిష్కారానికి సంపూర్ణ సహకారాన్ని అందిస్తోందని చెప్పుకొచ్చారు. ఇందుకోసం ప్రత్యేకమైన వేదికలను ఏర్పాటుచేసి సమన్వయంతో సమస్యల పరిష్కారానికి బాటలు వేస్తోందని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ కమిటీకి కేంద్ర జల వనరుల సంఘం ఛైర్మన్ నేతృత్వం వహించనున్నారు.



# పొగమంచుతో పది విమానాలు రద్దు

**హైదరాబాద్, జనవరి 2 :** ప్రతికూల వాతావరణం వల్ల శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి వెళ్లాల్సిన 10 విమానాలు రద్దు అయ్యాయి. ముంబయి, బెంగళూరు, విశాఖ, కోయంబత్తూర్, కోల్‌కతా, కోచి, వారణాసి, ఇందౌర్, పట్నా, గువాహటికి వెళ్లే విమాన సర్వీసులను రద్దు చేస్తూ డీజీసీఏ నిర్ణయం తీసుకుంది. శుక్రవారం.. తెలంగాణలో భారీగా పొగమంచు కమ్ముకుంది. హైదరాబాద్–విజయవాడ, హైదరాబాద్–బెంగళూరు హైవేలపై దట్టంగా అలముకోవడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. పొగమంచుతో హైదరాబాద్– బెంగళూరు హైవేపై నాలుగు లారీలు పరస్పరం ఢీకొన్నాయి. దీంతో ట్రాఫిక్ జామ్ అయింది. పెద్ద సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. శంషాబాద్ నుంచి పాలమాకుల వరకు సుమారు 10 కి.మీ మేర ట్రాఫిక్ స్తంభించిపోయింది. ఔటర్ రింగ్ రోడ్డుపైనా పొగమంచుతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

# కేసీఆర్ అసెంబ్లీకి రావాల్సిందే

(మొదటిపేజీ తరువాయి)

ఒకసారి ఉరితీయాలంటే రేవంత్ రెడ్డిని పదిసార్లు ఉరి తీయాలంటూ మండిపడ్డారు. శుక్రవారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో కవిత మాట్లాడుతూ.. ఈ సమావేశాలకు కేసీఆర్ వచ్చి సమాధానాలు చెప్పకపోతే బీఆర్ఎస్ పని ఖతం అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ తప్పు చేయకపోతే సభకు రావాల్సిందే అని పట్టుబట్టారు. సభకు రాకుండా పిల్ల కాకుల మీద సభా సమయాన్ని వదలొద్దంటూ హితవుపలికారు. ఈ విషయంలో ఒక కూతురుగా తన రక్తం ఉడుకుతోందన్నారు. ఉద్యమకారుడిని ఉరితీయాలని అంటే రక్తం మరుగుతోందని చెప్పారు. శాసన మండలి వద్ద మీడియాతో ఆమె చిట్‌చాట్ నిర్వహించారు. నా రాజీనామా ఆమోదం కోరేందుకు మండలికి వచ్చాను. కేసీఆర్‌పై రేవంత్ వ్యాఖ్యలు సరికాదు. కృష్ణా జలాలపై అసెంబ్లీలో కేసీఆర్ మాట్లాడి నోరు మూయించాలి. బీఆర్ఎస్ మనుగడ కొనసాగాలంటే ఆయన అసెంబ్లీకి రావాలి. నదీ జలాల అంశాన్ని పిల్లకాకుల మీద వదిలేయవద్దు. బీఆర్ఎస్‌లో బబుల్ షూటర్లకే డిప్యూటీ ఎ÷–లోర్ లీడర్ పదవులు ఇచ్చారని కవిత వ్యాఖ్యానించారు. సొంత జిల్లా మహబూబ్ నగర్‌కు రేవంత్ తెచ్చిన ప్రాజెక్టులు ఎన్ని అని ప్రశ్నించారు. మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావును ఉద్దేశించి కవిత మరోసారి తీవ్రమైన ఆరోపణలు చేశారు. హరీష్ రావు ఒక బచ్చా అని అన్నారు. కేసీఆర్ సభకు రాకపోతే హరీష్ రావే అన్నీ చూసుకోవడం సరికాదని.. కేసీఆర్ సభకు వచ్చి సమాధానం చెప్పాలని కవిత వ్యాఖ్యలు చేశారు.

# మూసీ పునరుజ్జీవంతో నగరానికి మహర్దశ

(మొదటిపేజీ తరువాయి)

సీఎం మాట్లాడారు. గతంలో జల వనరులను కలుషితం చేశారు. కబ్జాలతో ఫాంహౌస్‌లు నిర్మించారు. వాటి డ్రైనేజీలను జంట జలాశయాలకు కలిపారు. నిందితులపై ఉక్కుపాదం మోపాం. డ్రైనేజీలను కూలగొట్టాం. కాకతీయుల నుంచి నిజాం వరకు నదీ పరివాహకంలోనే ప్రాజెక్టులు చేపట్టారు. వరద ముంపు నుంచి నగరాన్ని రక్షించేందుకు 1922 నాటికి ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ ప్రాజెక్టులు చేపట్టారు. ప్రపంచ దేశాలతో హైదరాబాద్ పోటీపడేలా నగరాన్ని నిజాంలు తీర్చిదిద్దారు. వారు చేసిన అభివృద్ధిని గత పాలకులు కనుమరుగు చేశారు. నదులను కలుషితం చేసి నివాసయోగ్యం కాని ప్రాంతాలుగా మార్చారు. నగరంలోని మురుగుకాల్వలను మూసీకి కలిపారు. ఇలా కలుషితం చేయడంతో నల్గొండ జిల్లాలోని మూసీ పరివాహక ప్రజలు జీవించలేని దుర్భర పరిస్థితి నెలకొంది. ఆ పరిస్థితి నుంచి కాపాడాలని వేలాది మంది విజ్ఞప్తి చేశారని సిఎం తెలిపారు. ఈ నేపథ్యంలో మూసీ సుందరీకరణపై అధ్యయనం చేశాం. ఏడాదంతా నదిలో నీళ్లు ప్రవహించేలా ప్రణాళికలు రూపొందించాం. మూసీ ప్రక్షాళనకు కన్సల్టెంట్ కోసం గ్లోబల్ టెండర్లు పిలిచాం. 3 సంస్థలు జాయింట్ వెంచర్ కింద మూసీ పునరుద్ధరణ పనులు చేపట్టాయి. గోదావరి నుంచి 20 టీఎంసీల నీరు నగరానికి తరలించాలనే ప్రణాళిక ఉందని, అందులో ప్రజల దాహార్తిని తీర్చేందుకు 15 టీఎంసీలు, గండిపేటకు మరో 5 టీఎంసీలు తరలించేలా ఆలోచిస్తున్నామని వివరించారు. నదీ పరివాహక ప్రాంతాల్లో సుందరీకరణపై లండన్, జపాన్, జర్మనీ, దక్షిణ కొరియా, సింగపూర్‌లలో అధ్యయనం చేశాం. ప్రపంచస్థాయి నగరాల్లో నదీ పరివాహక ప్రాంతాలను కాపాడుకొని వ్యాపార కేంద్రాలుగా మార్చారు. ఆర్థికవ్యవస్థ బలోపేతానికి ఆయా దేశాలు పోటీపడుతున్నాయి. గుజరాత్‌లో సబర్మతి నది అభివృద్ధి కోసం 60వేల కుటుంబాలను తరలించారు. యూపీలో గంగా నదిని ప్రక్షాళన చేసి రివర్‌ఫ్రంట్ ఏర్పాటు చేశారు. ఆ అభివృద్ధిని భాజపా ఎన్నికల అజెండాగా మార్చారు. ఆయా రాష్ట్రాల్లో నదుల ప్రక్షాళనను వ్యతిరేకించడం లేదని రేవంత్ వివరించారు. కొందరు కడుపులో విషం తగ్గించుకుంటే మంచిదని విపక్ష పార్టీలోని పలువురు కీలక నేతలకు సీఎం రేవంత్ రెడ్డి హితవు పలికారు. మూసీ కాలుష్యం కంటే కొందరు మనుషుల కడుపులో ఉన్న విషం అత్యంత ప్రమాదకరమన్నారు. తాను వివరాలు చెబుతుంటే ఎందుకు విషం కక్కుతున్నారంటూ విపక్ష సభ్యులను ఆయన సూటిగా నిలదీశారు. ప్రజలకు నిజాలు తెలియవద్దని చర్చ జరగకుండా చూడాలనుకు ంటున్నారా? అని వారిని ప్రశ్నించారు. వివరాలు చెబుతుంటే నొప్పి ఎందుకు మీకు అంటూ విపక్ష సభ్యులపై ఆయన మండిపడ్డారు. మూసీకి అడ్డంగా పడుకుంటామంటున్న వారు..మొన్న వర్షాలు వచ్చినప్పుడు ఎక్కడికిపోయారంటూ వారిని సీఎం రేవంత్ రెడ్డి కడిగేశారు. కొంతమంది తనను రియల్ ఎస్టేట్ బ్రోకర్ అంటున్నా రని.. రియల్ ఎస్టేట్ సైతం ఒక ఇండస్ట్రీనే అని ఆయన వివరించా రు. హైటెక్ సిటీ నిర్మించాలనుకున్నప్పుడు కూడా ఇలాంటి విమర్శలే చేశారని పేర్కొన్నారు. రోజు రోజుకు పట్టణీకరణ పెరుగుతుందని చెప్పారు. రాబోయే 20 ఏండ్లలో 75 శాతానికి పట్టణీకరణ పెరుగు తుందని తెలిపారు. తెలంగాణలో మూసీ నది 240 కిలోమీటర్లు ప్రవహిస్తుందన్నారు. అనంతగిరి హిల్స్ నుంచి వాడపల్లి వరకు మూసీ ప్రవాహం ఉందన్నారు. మూసీ, ఈసీ నదులు కలిసే చోటు బాపుఘాట్ నిర్మిస్తామని.. అందుకే అక్కడ గాంధీసరోవర్ ప్రాజెక్ట్ చేపట్టామని తెలిపారు. నదీ పరివాహక ప్రాంతంలోనే అభివృద్ధి జరుగు తుందని పేర్కొన్నారు. మూసీ నది ప్రక్షాళనను మొదట 21 కిలోమీటర్లు చేయాలని చూస్తున్నామని.. హిమాయత్‌సాగర్ నుంచి గాంధీ సరోవర్ వరకు అభివృద్ధి చేస్తామని చెప్పారు. మార్చిలో తొలి దశ పనులు ప్రారంభిస్తామన్నారు. సంక్రాంతిలోగా తొలి దశ డీపీఆర్‌పై క్లారిటీ ఇస్తామని పేర్కొన్నారు. గండిపేట నుంచి గౌరెల్లి వరకు 51 కి.మీ మూసీ అభివృద్ధి చేస్తామని వివరించారు. 51 కి.మీ ఎలివేటెడ్ కారిడార్లు నిర్మిస్తామన్నారు. మీరాలం ట్యాంక్ కూడా మూసీ అభివృద్ధిలో భాగమేనని స్పష్టం చేశారు. ఈ ట్యాంక్‌పై రూ.450 కోట్లతో బ్రిడ్జి నిర్మిస్తున్నామని సీఎం రేవంత్ చెప్పారు. నదులు కలుషితం చేసి నివాసయోగ్యం కాని ప్రాంతాలుగా చేశారని మండిప డ్డారు. నదీ పరివాహక ప్రాంతాల నిర్వాసితులకు ప్రత్యామ్నాయం కోరామని చెప్పారు. మూసీ నది కలుషితం కారణంగా నల్లగొండ జిల్లాలో ప్రజలు జీవించలేని పరిస్థితి నెలకొందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కలుషిత నీటి నుంచి కాపాడాలని వేలాదిగా విజ్ఞప్తులు వచ్చాయన్నారు. ఏడాదంతా మూసీలో నీళ్లు ప్రవహించేలా ప్రణాళిక లు సిద్ధం చేసినట్లు చెప్పారు. మూసీ పరివాహక ప్రాంతంలో ఆల యాలు, మసీదులు, గురుద్వారాలు, చర్చి నిర్మిస్తామని తెలిపారు. మూసీ నదిని ప్రక్షాళన చేయాల్సిందేనని స్పష్టం చేశారు. వచ్చే మూడు నెలల్లో అంచనాలు ఫైనల్ చేస్తామని ప్రకటించారు. ఏడీబీ బ్యాంకు రూ.4,100 కోట్ల రుణం ఇస్తుందన్నారు. త్వరలో అన్ని వివరాలు వెల్లడిస్తామని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. డిపిఆర్ పూర్తయ్యాక అసెంబ్లీలో చర్చిస్తామని, సభ్యుల సూచనలు కూడా స్వీకరిస్తామని అన్నారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ఎమ్మెల్యేలకు సీఎం రేవంత్ రెడ్డి కీలక సూచన చేశారు. మీ నియోజకవర్గాల్లో ఎలాంటి అభివృద్ధి కావాలో చెప్పాలని సూచించారు. పేదలకు మంచి ఇళ్లు కట్టించి వారికి మెరుగైన వసతులు కల్పిద్దామని పిలుపునిచ్చారు. హైదరాబాద్ ను ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దాలనేదే తమ సంకల్పమని ఆయన స్పష్టం చేశారు. తాము మంచి పని చేయాలనుకుంటున్నాం? మీ సూచనలు సలహాలు ఇవ్వాలన్నారు. డీపీఆర్ సిద్ధమయ్యాక ఎమ్మెల్యేలందరికీ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చి సలహాలు తీసుకుంటామని గ్రేటర్ పరిధిలోని ఎమ్మెల్యేలకు సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.



# గూడ్స్‌కి వాహనాలపై 7.5 శాతం లైఫ్ టాక్స్

(మొదటిపేజీ తరువాయి)

హయాంలోని పదేళ్లలో వాహన సారథిలో తెలంగాణ చేరలేదని చెప్పుకొచ్చారు. దేశంలో 29 రాష్ట్రాలు వాహన సారథిలో చేరితే తెలంగాణ మాత్రం చేరలేదని.. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రాష్ట్రాన్ని వాహన సారథిలో చేర్చామని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాలతో రోడ్ సేఫ్టీపై సెస్ ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ ,కర్ణాటక , మహారాష్ట్ర ,గుజరాత్ రాష్ట్రాల్లో అమలు చేస్తున్నారని తెలిపారు మంత్రి పొన్నం ప్రభాకర్. ద్విచక్ర వాహనాలకు రూ.2 వేలు, లైట్ మోటార్ వాహనాలకు రూ.5 వేలు , హెవీ వాహనాలకు రూ.10 వేలు రోడ్ సేఫ్టీ సెస్ ఏర్పాటు చేశామని వెల్లడించారు. కొత్తగా రిజిస్టర్ అయ్యే వాహనాలకు మాత్రమే రోడ్ సేఫ్టీ సెస్ విధించినట్లు వివరించారు. ఆటోలు ,ట్రాక్టర్లకు ఇది వర్తించదని స్పష్టం చేశారు. మరణాలు ఎక్కువగా రోడ్డు ప్రమాదాలతోనే జరుగుతున్నాయని తెలంగాణ డీజీపీ శివధర్‌రెడ్డి ఇటీవల ఒక ప్రకటన చేశారని ప్రస్తావించారు. జనవరి 1వ తేదీ నుంచి జనవరి 31వ తేదీ వరకు జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. తాము రోడ్ సేఫ్టీ నిబంధనలు పాటిస్తామని.. విద్యార్థులు వారి తల్లిదండ్రుల్లో అవగాహన తీసుకురావాలని సూచించారు. ఇందుకోసం విద్యాశాఖ, సంక్షేమ శాఖ, పలు పాఠశాలలు పాల్గొనేలా చర్యలు తీసుకున్నామని అన్నారు. రోడ్డు భద్రతాపై విద్యార్థులకు, ప్రతి పౌరుడుకి అవగాహన కల్పిస్తున్నామని చెప్పుకొచ్చారు. యూనిసెఫ్ సహకారంతో పలు పాఠశాలల్లో చిల్డ్రన్ ట్రాఫిక్ అవేర్‌నెస్ పార్క్ ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. తెలంగాణను రోడ్డు ప్రమాదాల రహితంగా మార్చడానికి జిల్లా రోడ్ సేఫ్టీ కమిటీలు ఏర్పాటు చేశామని వెల్లడించారు మంత్రి పొన్నం ప్రభాకర్. రాష్ట్రంలో వెయ్యి మంది రవాణా శాఖ అధికారులు ఉంటే ..1. 80 లక్షల వాహనాలు ఉన్నాయని..ఒక్కొక్కటిగా వాహనాలు పరిశీలించడం కుదరదని చెప్పుకొచ్చారు. ఎవరికి వారే స్వయంగా వాహనాల ఫిట్‌నెస్ చూసుకోవాలని.. రోడ్డు నిబంధనలు తప్పకుండా పాటించాలని సూచించారు. వికారాబాద్ బస్సు ప్రమాదంలో ఎవరో చేసిన తప్పిదానికి అమాయకులు చనిపోయారని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖ విద్యార్థులు, ఇతర పాఠశాలల్లోని విద్యార్థులు రోడ్ సేఫ్టీ కార్యక్రమంలో పాల్గొనాలని సూచించారు. ప్రజా ప్రతినిధులు , అధికారులు, విద్యార్థులు అందరూ రోడ్ సేఫ్టీ కార్యక్రమంలో పాల్గొనాలని మార్గనిర్దేశం చేశారు. బ్లాక్ స్పాట్‌లను నిర్మూలించేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. అతి వేగాన్ని కట్టడి చేసేలా కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ రోడ్ సేఫ్టీ మంత్‌పై లేఖ రాశారని ప్రస్తావించారు మంత్రి పొన్నం ప్రభాకర్. రోడ్ సేఫ్టీపై ప్రజలు, అన్ని విభాగాల అధికారులు భాగస్వామ్యం కావాలని సూచించారు. ప్రమాదాలు జరిగినప్పుడు ఏ విధంగా చర్యలు తీసుకుంటున్నామనే విషయాన్ని ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత అధికారులదేనని అన్నారు. గూడ్స్ ఆటోలకు , తేలికపాటి వాహనాలకు మాత్రమే త్రైమాసిక టాక్స్ నుంచి లైఫ్ టాక్స్‌లోకి తీసుకుంటున్నట్లు వెల్లడించారు. తెలంగాణలో వాతావరణ కాలుష్యాన్ని తగ్గించడానికి ఈవీ పాలసీ తీసుకొచ్చామని చెప్పుకొచ్చారు. దాదాపు రూ.1000 కోట్లు టాక్స్‌ను ప్రభుత్వం నష్టపోయిందని అన్నారు. హైదరాబాద్‌లో ఈరోజు ఎయిర్ క్వాలిటీ 300 దాటిందని తెలిపారు మంత్రి పొన్నం ప్రభాకర్. ఈవీ పాలసీ ద్వారా ఎలక్ట్రిక్ వాహనాలు పెరుగుతాయని.. దీంతో కాలుష్యాన్ని అరికడుతున్నామని చెప్పుకొచ్చారు. స్క్రాప్ పాలసీ తీసుకొచ్చామని.. 15 ఏళ్లు దాటిన వాహనాలు ఈ స్క్రాప్ పాలసీలోకి వస్తాయని వెల్లడించారు.

# కవిత కేసీఆర్ వదిలిన బాణమే

(మొదటిపేజీ తరువాయి)

అభివర్ణించారు. కవిత కన్ఫ్యూజన్ లో ఉండి ప్రజలను కన్ఫ్యూజ్ చేస్తోందని వ్యంగ్యంగా అన్నారు. కవిత ఏ పార్టీలో ఉందో స్పష్టం చేయాలంటూ మంత్రి కోమటిరెడ్డి డిమాండ్ చేశారు. తన తండ్రి మీద సీఎం రేవంత్ చేసిన వ్యాఖ్యలపై స్పందించిన ఆమె.. హరీష్ రావు మీద చేసిన వ్యాఖ్యలపై ఎందుకు స్పందిం చలేదు? అంటూ కవితను ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సూటిగా ప్రశ్నించారు. ఇక బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ సీఎం కేసీఆర్‌పై సీఎం రేవంత్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. సీఎం స్పందనపై కవిత శుక్రవారం కాస్తా ఘాటుగా స్పందించారు. దీనికి కోమటిరెడ్డి ఘాటుగా స్పందించారు. తనకు సీఎం రేవంత్ రెడ్డి అంటే గౌరవమని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డిని ఎవరు ఏమన్నా అంటే కౌంటర్ ఇస్తానన్నారు. శుక్రవారం అసెంబ్లీ ప్రాంగణంలో మీడియాతో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. మంత్రి పదవి కోసం తాను ఏ రోజు పాకులాడలేదని చెప్పారు. మంత్రి పదవి కావాలంటూ తాను ఎవరిని అడగలేదని పేర్కొన్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం మంత్రి పదవినే తాను త్యాగం చేసిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. తనకు, తన తమ్ముడికి మధ్య ఎటువంటి గొడవలు లేవని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో జనవరి 1వ తేదీ గురువారం సాయంత్రం ప్రజాభవన్‌లో జలాలు – నిజాలు అంశంపై తెలంగాణ భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పవర్ పాయింట్ ప్రెజంటేషన్ ఇచ్చారు. దీనికి కాంగ్రెస్ పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతోపాటు పార్టీలోని సీనియర్లు పాల్గొన్నారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రానికి రావాల్సిన నీటి వాటా.. బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌తోపాటు మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు వల్లే తగ్గిదంటూ సీఎం రేవంత్ కాస్తా ఘాటుగా స్పందించారు. సీఎం చేసిన వ్యాఖ్యలపై కవిత మండిపడ్డారు. కవిత వ్యాఖ్యలపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు.



# ఫిబ్రవరిలో మున్సిపల్ ఎన్నికలు

(మొదటిపేజీ తరువాయి)

విమర్శించారు. బీజేపీకి వ్యతిరేకంగా మాట్లాడే ముఖం బీఆర్ఎస్ నేతలకు లేదని ఎద్దేవా చేశారు. తమ తప్పు ఉంటే అసెంబ్లీలో నిరూపించాలని సవాల్ విసిరారు. మూసీ అంశంలో బీఆర్ఎస్ నేతలే రన్నింగ్ కామెంటరీ చేశారని ప్రస్తావించారు. బీఆర్ఎస్ ప్రభావం కోల్పోయిందని.. ఉనికి కాపాడుకోవడానికి ఆ పార్టీ నేతలు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. రేగా పథకంపై, బీజేపీకి వ్యతిరేకంగా మాట్లాడలేక బీఆర్ఎస్ నేతలు అసెంబ్లీ నుంచి వెళ్లిపోయారని ఎద్దేవా చేశారు. పేదవారి పథకం గురించి బీఆర్ఎస్ నేతలు ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నల వర్షం కురిపించారు. సోషల్ వెల్ఫేర్ హాస్టళ్ల విద్యార్థులకు వేడి నీటిని అందించడానికి సోలార్ పవర్‌ను ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టామని అన్నారు. ఇందుకోసం అధికారులకు ఆదేశాలు ఇచ్చామని తెలిపారు. కేసీఆర్ హయాంలో ఎమ్మెల్యేలకు అసెంబ్లీలో కనీసం గౌరవం ఇవ్వలేదని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

# మావోయిస్టులకు మరో ఎదురుదెబ్బ

## డీజీపీ శివధర్ రెడ్డి ముందు ముఖ్య నేత బర్సే దేవా.. లొంగుబాటు

**హైదరాబాద్, జనవరి 2 :** మావోయిస్టు పార్టీకి మరో ఎదురుదెబ్బ తగిలింది. ఇటీవల కాలంలో అనేక మంది మావోయిస్టు నేతల పోలీసుల ఎదుట లొంగిపోయిన విషయం తెలిసిందే. పలువురు కీలక నేతలు ఎన్‌కౌంటర్‌లో మరణించడం, పార్టీ బలహీనపడటం, ఆరోగ్య సమస్యలు ఇతరత్రా కారణాలతో గత సంవత్సరం వందల్లో మావోయిస్టులు పోలీసుల ఎదుట సరెండర్ అయ్యారు. ఇది మావోయిస్టు పార్టీకి కోలుకోలేని దెబ్బే అని చెప్పుకోవచ్చు. తాజాగా మరోసారి మావోయిస్టు పార్టీకి గట్టి షాక్ తగిలింది. మరో కీలక నేత పోలీసుల ముందు లొంగిపోయారు. మావోయిస్టు ముఖ్య నేత బర్సే దేవా.. డీజీపీ శివధర్ రెడ్డి ముందు లొంగిపోయారు. దేవా మావోయిస్టు పార్టీ గెరిల్లా లిబరేషన్ ఆర్మీ చీఫ్‌గా పనిచేస్తున్నారు. మావో అధినేత హిడ్మా ఎన్‌కౌంటర్ తర్వాత మావోయిస్టు పార్టీ సాయిధ బలగాల వ్యవహారాలను బర్సే దేవా చూస్తున్నారు. హిడ్మా, బర్సే దేవా ఒకే గ్రామానికి చెందిన వారుగా గుర్తించారు. మావోయిస్టు పార్టీకి ఆయుధాల సరఫరాలో దేవా అత్యంత కీలక పాత్ర పోషించారు. ఇప్పుడు డీజీపీ ముందు దేవా లొంగిపోగా. అతడి నుంచి మౌంటెన్ ఎల్ఎంజీని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దేవాతో పాటు మిల్టీ ఆపరేషన్ సభ్యులు కూడా సరెండర్ అయ్యారు. శనివారం బర్సే దేవాను మీడియా ముందుకు తీసుకువచ్చే అవకాశం ఉంది.

# ఇంటర్ బోర్డు కీలక నిర్ణయం

(మొదటిపేజీ తరువాయి)

ఉంటుందని పేర్కొన్నారు. విద్యార్థుల తల్లి తండ్రులు హాల్‌టికెట్‌లో ముద్రించిన వివరాలు క్షుణ్ణంగా పరిశీలించాలని, ఏమైనా తప్పులు ఉంటే సంబంధిత కళాశాల ప్రిన్సిపల్‌కి సమాచారం ఇవ్వాలని ఇంటర్ బోర్డ్ ఓ ప్రకటనలో తెలిపింది. హాల్‌టికెట్ నంబర్, పరీక్షా కేంద్రం చిరునామాతో పాటు ఏ రోజు ఏ పరీక్ష జరుగుతుందో తల్లిదండ్రులకు తెలియజెప్పడమే ప్రధాన ఉద్దేశమని పేర్కొంది. అధిక శాతం తల్లిదండ్రుల వద్ద స్మార్ట్ ఫోన్ ఉండటంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది.

# అసెంబ్లీ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వాకౌట్

(మొదటిపేజీ తరువాయి)

గంటల ముందు పంపాలని డిమాండ్ చేశారు. తాము అడిగిన ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానం ఇవ్వడం లేదని ఆక్షేపించారు. నిరసనలు తెలిపేందుకు మైక్ ఇవ్వకపోవడం.. ప్రతిపక్షం గొంతు నొక్కడమేనన్నారు. ప్రశ్నోత్తరాల సమయంలో నిరసన తెలపడం ప్రతిపక్ష సభ్యుల హక్కు అని చెప్పారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ ఏకపక్ష వైఖరికి నిరసనగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు నిరసన చేపట్టారు. అసెంబ్లీ నుంచి గన్‌పార్క్ వద్దకు కాలినకడన వచ్చిన ఎమ్మెల్యేలు ఆందోళన చేపట్టారు. స్పీకర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఇదేమీ రాజ్యం.. దొంగల రాజ్యం దోపిడీ రాజ్యం అంటూ నినాదాలు చేశారు. ఇది శాసనసభనా? గాంధీ భవనా అంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్రశ్నించారు. ప్రశ్నించే గొంతులను నొక్కే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. అంతకుముందు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అసెంబ్లీ నుంచి వాకౌట్ చేశారు. రెండో రోజు అసెంబ్లీ సమావేశాల్లో మూసీ సుందరీకరణ అంశంపై చర్చ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి కొందరు కడుపులో విషం తగ్గించుకుంటే మంచిదని వ్యాఖ్యానించారు. దీనిపై బీఆర్ఎస్ అభ్యంతరం వ్యక్తం చేసింది. సీఎం వ్యాఖ్యలపై చర్చించేందుకు సమయం ఇవ్వాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కోరారు. కానీ అందుకు స్పీకర్ నిరాకరించడంతో బీఆర్ఎస్ సభ్యులు వాకౌట్ చేశారు.

## ఆన్‌లైన్ గేమ్‌లకు బానిసయి

# అప్పులపాలు

(మొదటిపేజీ తరువాయి)

నష్టాలు రావడంతో ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గత కొంత కాలంగా శ్రీకర్ ఆన్‌లైన్ బెట్టింగ్స్, రమ్మీ వంటి గేమ్స్‌కు బానిసయ్యాడు. తల్లిదండ్రులు, స్నేహితులు ఎంతగా వారించినా వారి మాటలు పట్టించుకోలేదు. తొలుత చిన్న మొత్తాల్లో లాభాలు రావడంతో.. మరింత ఆశతో బంధువులు, స్నేహితుల వద్ద అప్పుచేసి మరీ ఆడటం మొదలుపెట్టాడు. గత రెండు సంవత్సరాలుగా సుమారు రూ.20లక్షల వరకు ఆన్‌లైన్ గేమ్‌లో నష్టపోయాడని బాధితుడు తల్లి కామారెడ్డి పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. శ్రీకర్ మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్న పోలీసులు.. అతడు ఏయే యాప్‌లలో ఎంత డబ్బు పోగొట్టుకున్నాడు? ఎవరెవరు అతన్ని వేధించారు? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నామన్నారు. రెండేళ్లుగా ఎన్నో చోట్ల అప్పులు తీసుకున్నాడని.. ఇటీవల అప్పిచ్చిన వాళ్లు తిరిగివ్వాలని ఒత్తిడి చేయడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడి ఉండొచ్చని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల డిజిటల్ యాక్టివిటీస్‌పై దృష్టి సారించాలని, బెట్టింగ్ యాప్స్, ఆన్‌లైన్ గేమింగ్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.

# మాంజా పంజా.. తస్మాత్ జాగ్రత్

- చైనా మంజా వాడితే కఠిన చర్యలు
- సోదాలు చేపట్టిన సైబరాబాద్ పోలీసులు





**హైదరాబాద్, జనవరి 2 :** నైలాన్ 'చైనీస్' మాంజా, గాజు లేదా లోహంతో కోటింగ్ చేసిన పదునైన దారాల వినియోగం వల్ల రాష్ట్రంలోని ఇటీవల వరుస ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఆకాశంలో ఎగిరే గాలిపటం ఆనంద హేతువైతే, అదే రోడ్డుపై పడే మాంజా దారం మృత్యువుకు కారణం అవుతోంది. ఇది శోచనీయం. మనుషులు, జంతువులు, పక్షుల ప్రాణాలకు ముప్పుగా పరిణమిస్తోంది. సైబరాబా ద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మియాపూర్ ? చందానగర్ ప్రధాన రహదారి, మాదాపూర్, హైటెక్ సిటీ, కూకట్‌పల్లి, గచ్చిబౌలి వంటి ప్రాంతాల్లో ఇటీవలి కాలం లో ద్విచక్ర వాహనదారుల మెడలకు చైనీస్ మాంజా చిక్కి తీవ్ర గాయాలపాలైన ఘటనలు కలకలం రేపాయి. బాలానగర్ రహదారిపై ట్రాఫిక్ మధ్యలో ద్విచక్ర వాహనదారుడి మెడకు దారం తగలడం వలన మెడకు తీవ్ర గాయమయ్యింది. అపార్ట్ మెంట్లు, మేడలపై నుంచి గాలిపటాలు ఎగురవేయడం కారణంగా మాంజా చెట్ల కొమ్మలకు, విద్యుత్ తీగలకు చిక్కి రోడ్డుపై వేలాడటం కారణం గా ప్రమాదాలకు దారి తీస్తోంది. చైనీస్ మాంజా నైలాన్, సింథటిక్ ÷బైర్‌తో తయారవడంతో పాటు గాజుపొడి, లోహచూర్ణం పూత ఉండటంతో అత్యంత పదునుగా, ప్రమాదకరంగా మారుతోంది. ఈ మాంజా ఒక్కసారిగా వేగంగా మెడకు చుట్టుకుంటే తీవ్ర రక్తస్రావం జరిగి ప్రాణాపాయం ఏర్పడే ప్రమాదం ఉంది. మానవులకే కాదు, పక్షులు, ఇతర మూగజీవలకూ ఈ మాంజా వల్ల తీవ్రంగా నష్టపోతు న్నాయి. పిచ్చుకలు, కాకులు, గద్దలు, రెక్కలకు దారాలు చిక్కి ఎగరలేక మృతి చెందుతున్న ఘటనలు నమోదవుతున్నాయి. వీధి కుక్కలు, పశువుల కాళ్లకు దారాలు చుట్టుకుని గాయాలవు తున్నాయి. ఈ పరిస్థితుల నేపథ్యంలో ప్రజల భద్రత దృష్ట్యా మాంజా అమ్మినా, వినియోగించినా చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని సైరాబాద్ పోలీసులు హెచ్చరికలు జారీ చేశారు. సైబరాబాద్ లో ఈ సంవత్సరం చైనీస్ మాంజా విక్రయదారులపై 53 కేసులు నమోదయ్యాయి. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు తనిఖీలు చేపట్టారు. చైనీస్ మంజా అమ్మకాలపై నిషేదం ఉందని, అమ్మితే కఠినచర్యలు తప్పవవని సైబరాబాద్ పోలీసుల సూచనలు చేశారు. చైనీస్ మాంజా, నైలాన్, గాజు లేదా మెటల్ కోటింగ్ ఉన్న చైనీస్ మాంజాను అమ్మవద్దు, కొనవద్దన్నరు. చైనీస్ మాంజా విక్రయం, నిల్వ, రవాణా చట్టవిరుద్ధమని హెచ్చరించారు. ఇంటి పైకప్పులు, టెర్రస్ ల పై గాలిపటాలు ఎగరవేసేటప్పుడు అదనపు జాగ్రత్తలు తప్పనిసరి. గోడ అంచులు లేని మిదె పై నుంచి కింద పడే ప్ర మాదాలు పొంచి ఉన్నాయి. పిల్లలు గాలిపటాలు ఎగరవేసే సమయంలో ప్రమాదాలు జరగకుండా తల్లిదండ్రులు లేదా పెద్దలు తప్పనిసరిగా పర్యవేక్షించాలి. రోడ్లు, ప్రధాన రహదారులు, ట్రాఫిక్ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో గాలిపటాలు ఎగరవేయ కూడదు. విద్యుత్ లైన్లు, ట్రాన్స్ ఫార్మర్లు, సెల్ టవర్ల సమీపంలో గాలిపటాలు ఎగరవేయడం ప్రమాదకరం. విస్తృతమైన బహిరంగ ప్రదేశాలు, మైదానాలను మాత్రమే గాలిపటాలు ఎగురవేయడానికి అన-ువైనవి. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి. తద్వారా ప్రమాదలను కొంతవరకు నివారించవచ్చు. రోడ్డుపై వేలాడుతున్న గాలిపటాల దారాలు కనిపిస్తే వెంటనే జీహెచ్‌ఎమ్ సీ అధికారులకు సమాచారం ఇవ్వాలి. తెగిపోయిన గాలిపటాల దారాలను రోడ్లు, చెట్లపై కనిపిస్తే సురక్షితంగా సేకరించి జాగ్రత్తగా డిస్పోజ్ చేయాలి. చెట్లపై లేదా విద్యుత్ తీగలపై చిక్కుకున్న దారాలను స్వయంగా తొలగించే ప్రయత్నం చేయకూడదు. వాహనదారులు గాలిపటాల సీజన్‌లో మితవేగంతో ప్రయాణించాలి. చిన్న పిల్లలను రోడ్లపై లేదా జనసాంద్రత ఉన్న ప్రాంతాల్లో గాలిపటాలు ఎగరవేయడానికి అనుమతించకూడదు. చైనీస్ మాంజా విక్రయిస్తున్నట్లు గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. చట్టవిరుద్ధంగా చైనీస్ మాంజా వినియోగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని గుర్తుంచుకోవాలని హెచ్చరించారు.



## మున్సిపల్ పరిపాలన వ్యవస్థను పటిష్టం చేసే లక్ష్యం

- జీహెచ్ఎంసీలో పౌరులకు మెరుగైన సేవలను అందిస్తాం
- పురపాలక, జీహెచ్ఎంసీ చట్టసవరణ బిల్లుపై శ్రీధర్ బాబు
- నిపుణుల సలహాతో ముందుకు వెళ్లాలన్న కూనంనేని

**హైదరాబాద్, జనవరి 2 :** మున్సిపల్ పరిపాలన వ్యవస్థను పటిష్టం చేసే దిశగా ముందుకు వెళ్తున్నామని తెలంగాణ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. అసెంబ్లీలో పురపాలక, జీహెచ్ఎంసీ చట్టసవరణ బిల్లుపై చర్చలో శ్రీధర్ బాబు మాట్లాడారు. జీహెచ్ఎంసీలో పౌరులకు మెరుగైన సేవలను అందించేందుకు ప్రణాళిక రూపొందించామని చెప్పారు. హైదరాబాద్‌ను మళ్లీ ఎన్ని కార్పొరేషన్లుగా విభజిస్తామో ఇంకా నిర్ణయించలేదని చెప్పారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకే గ్రేటర్ విలీనం జరిగిందన్నారు. మూసీ విషయంలో సీఎం ఎవరి పేర్లు ప్రస్తావించలేదు. పేర్లు ప్రస్తావించనప్పుడు భారత రాష్ట్ర సమితి సభ్యులు ఎందుకు స్పందిస్తున్నారు. మూసీ విషయంలో సభ్యుల సూచనలు స్వీకరిస్తామని సీఎం చెప్పారు. గ్రేటర్‌ను ఎన్ని కార్పొరేషన్లుగా విభజించాలో అందరి అభిప్రాయాలు తీసుకుని ముందుకెళ్తాం. గ్రేటర్ హైదరాబాద్‌ను మూడు కార్పొరేషన్లుగా విభజించాలని ప్రాథమికంగా అనుకుంటున్నాం. ప్రస్తుతం హైదరాబాద్ ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 174 పాయింట్లు ఉంది. నగరంలో గాలి నాణ్యత మున్ముందు మరింత పడిపోకూడదని భావిస్తున్నాం. కాలుష్యం మరింత పెరిగిపోకూడదనే.. నగరంలోని పరిశ్రమలను ఓఆర్ఆర్ అవతలకు తరలించే పక్రియ చేపట్టాం అన్నారు. హైదరాబాద్‌ను 360 డిగ్రీలు కవర్ చేసేలా.. మెట్రో విస్తరణ చేపట్టాలని నిర్ణయించాం. అనుమతులు, నిర్వహణలో సమస్యలు రావొద్దనే మెట్రో రైలు ప్రాజెక్టును ప్రభుత్వం టేకోవర్ చేస్తోంది. హైదరాబాద్‌లో మున్ముందు మొత్తం ఎలక్ట్రిక్ బస్సులు మాత్రమే తిరిగేలా చూస్తాం అని మంత్రి వెల్లడించారు. జీహెచ్ఎంసీలో వార్డుల సమస్య ఉంటే పరిష్కరిస్తాం. ఇప్పటికే 8 మంది జోనల్ కమిషనర్లను నియమించాం. హైదరాబాద్ పరిపాలన కోసం ప్రత్యేకంగా ఇద్దరు ఐఏఎస్ అధికారులను నియమించాం. గత ప్రభుత్వం సిబ్బందిని నియమించకుండానే జిల్లాలను 33కి పెంచింది. 33 కలెక్టరేట్‌లను నిర్మించింది కానీ.. వాటిలో సిబ్బంది లేరు. ఈ ప్రభుత్వం రాగానే టీజీపీఎస్సీ ద్వారా కలెక్టరేట్లలో సిబ్బందిని నియమించాం. కేంద్రంలోని భాజపా ప్రభుత్వం ఉపాధి హామీ పథకానికి తూట్లు పొడించింది. ఉపాధి హామీ పథకానికి మహాత్మాగాంధీ పేరు ఉంటే.. అది కూడా తొలగించారని శ్రీధర్ బాబు అన్నారు. మున్సిపాలిటీల విలీనంతో హైదరాబాద్.. అతిపెద్ద నగరంగా అభివృద్ధి చెందడం సంతోషంగా ఉందని సీపీఐ ఎమ్మెల్సీ కూనంనేని సాంబశివరావు అన్నారు. అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ.. వికేంద్రీకరణలో జాగ్రత్త వహించాలని, పరిపాలన సామర్థ్యాన్ని సరిచూసుకోవాలని ప్రభుత్వానికి సూచించారు. ప్రపంచ మహానగరంగా మారాలని గొప్పలకు పోతే తిప్పలు తప్పవన్నారు. మౌలిక సమస్యలు ఎలా పరిష్కరించాలన్న దానిపై ఆలోచన చేయాలని చెప్పారు. వర్షాకాలంలో చిన్న వర్షాలకే హైదరాబాద్‌లో ట్రాఫిక్‌జామ్ అవుతుందన్నారు. జిల్లాలు మహానగరంలో విలీనం అవుతున్నాయని, ప్రపంచంలో ఉన్న సౌకర్యాలు కల్పించే అవకాశముందని చెప్పారు. దీనిపై పూర్తిస్థాయిలో అధ్యయనం చేయాల్సిన అవసరముందని అభిప్రాయపడ్డారు. కాలుష్య, డ్రైనేజీ, రోడ్డు వంటి అంశాలపై మేధావులతో చర్చించాలని చెప్పారు.

# మూసీ ప్రణాళికపై స్పష్టత ఏదీ

- వ్యయంపైనా గందరగోళ వ్యాఖ్యలు
- నిర్వాసితులకు అన్యాయం చేస్తే అడ్డుపడతాం
- బుల్‌డోజర్లను అడ్డుకుంటామన్న హరీష్ రావు



**హైదరాబాద్, జనవరి 2 :** మూసీ ప్రక్షాళనకు ప్రభుత్వం ఎంత ఖర్చు చేస్తుందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రశ్నించారు. మూసీ ప్రక్షాళనకు డబ్బులు ఎక్కడి నుంచి తెస్తున్నారని అడిగారు. ఒకసారి లక్ష కోట్లు అన్నారని.. మ-రోసారి లక్షన్నర కోట్లు అన్నారని తెలిపారు. మూసీ సుందరీకరణకు ఒరిజినల్ వ్యయమెంత అని నిలదీశారు. రెండో రోజు అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా ప్రశ్నోత్తరాల సమయంలో హరీశ్‌రావు మాట్లాడుతూ.. మూసీ సుందరీకరణ కోసం ఇప్పటివరకు ఎన్ని ఇండ్లు కూల్చివేశారని ప్రశ్నించారు. మూసీ ప్రాజెక్టులో భాగంగా నిర్వాసితులందరికీ ఇండ్లు ఇచ్చారా అని అడిగారు. ప్రాజెక్టు కోసం ఎంత ప్రైవేటు భూమిని సేకరిస్తున్నారని ప్రశ్నించారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం రూ.14.50 లక్షల చొప్పున నిర్వాసితులకు పరిహారం ఇవ్వాల్సి ఉంటుందని గుర్తుచేశారు. అలాగే 200 గజాల ఇంటి స్థలం ఇవ్వాల్సి ఉంటుందన్నారు. మరి నిర్వాసితులకు కేసీఆర్ కట్టిన డబుల్ బెడ్రూం ఇళ్లు ఇచ్చారా అని ప్రశ్నించారు. మూసీలోకి నీళ్లు తీసుకొస్తామని మంత్రి చెప్పారని హరీశ్‌రావు తెలిపారు. రెండున్నర టీఎంసీల గోదావరి జలాలను ఎక్కడి నుంచి తీసుకొస్తున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. మల్లన్న సాగర్ నుంచి తీసుకొస్తున్నారా? లేదా గాలిలో నుంచా అని మండిపడ్డారు. మూసీ ప్రక్షాళనకు ఎంత ఖర్చు పెట్టాలని ప్రభుత్వం అనుకుంటుందో సమాధానం చెప్పాలన్నారు. మూసీలోకి మురుగునీరు రాకుండా బీఆర్ఎస్ ప్రభుత్వంలో 30కి పైగా ఎస్టీపీలు నిర్మించామని, వికారాబాద్‌లో కూడా ఎస్టీపీలు నిర్మించామని తెలిపారు. కానీ అవి ఇప్పుడు పనిచేయడం లేదన్నారు. ఇటీవల వచ్చిన మూసీ వరదలపైనా హరీశ్‌రావు అనుమానం వ్యక్తం చేశారు. అసలు జంట జలాశయాల్లోకి ఎంత వరద నీరు వస్తుందో తెలుసా అని ప్రశ్నించారు. ఒకేసారి ఉద్దేశపూర్వకంగా జలాశయాల గేట్లు ఎత్తారా అని నిలదీశారు. మూసీ పరివాహక ప్రాంతంలోని ఇండ్లను ముంచడానికే గేట్లు తెరిచారా అని అడిగారు. మూసీ సుందరీకరణ పేరుతో పేదల ఇండ్లు కూల్చివేస్తే బీఆర్ఎస్ ఊరుకోదని హెచ్చరించారు. అవసరమైతే బుల్డోజర్ల కింద పడుకుని కూల్చివేతలను అడ్డుకుంటామని స్పష్టం చేశారు.

### మూసీకంటే కంపుగా రేవంత్ వ్యాఖ్యలు

సీఎం రేవంత్ రెడ్డి మాటలు మూసీ కంటే కంపుగా ఉన్నాయని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. సభలో ఉన్న సభ్యులందరికీ సమానమైన హక్కులు ఉంటాయని ఆయన తెలిపారు. సభ్యుల హక్కులను కాపాడాల్సింది స్పీకరేనని స్పష్టం చేశారు. ఏడు రోజులు సభ నడుపుతామని బీఏసీలో చర్చించామని హరీశ్‌రావు తెలిపారు. కానీ బీఏసీ కాపీలో 7 రోజులు అని ఎక్కడా లేదని పేర్కొన్నారు. సభ ఎజెండా వివరాలు అర్ధరాత్రి 2 గంటలకు వస్తే.. సభ్యులు ఎలా ప్రిపేర్ అవుతారని ఆయన ప్రశ్నించారు. కాగా, రెండో రోజు అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా మూసీ సుందరీకరణ అంశంపై చర్చ జరుగుతోంది. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి కొందరు కడుపులో విషం తగ్గించుకుంటే మంచిదని వ్యాఖ్యానించారు. దీనిపై బీఆర్ఎస్ అభ్యంతరం వ్యక్తం చేసింది. సీఎం వ్యాఖ్యలపై చర్చించేందుకు సమయం ఇవ్వాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కోరారు. కానీ అందుకు స్పీకర్ నిరాకరించడంతో బీఆర్ఎస్ సభ్యులు వాకౌట్ చేశారు.



## మూసీ ప్రణాళికలను స్పష్టం చేయాలి

- పేదలకు అన్యాయం జరగకుండా చూడాలి
- అసెంబ్లీలో ఎంఐఎం సభ్యుడు అక్బరుద్దీన్

**హైదరాబాద్, జనవరి 2 :** మూసీ ప్రక్షాళనతో నిరుపేదల బతుకులు చితికిపోవద్దని ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ అన్నారు. అసలు మూసీ ప్రక్షాళన ఎక్కడి నుంచి ఎక్కడి వరకు చేస్తారని ప్రశ్నించారు. వికారాబాద్ నుంచి గండిపేట వరకు ప్లాన్స్ ఏంటో చెప్పాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రెండో రోజు అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా మూసీ ప్రక్షాళనపై జరిగిన చర్చలో అక్బరుద్దీన్ ఓవైసీ మాట్లాడుతూ.. మూసీ ప్రక్షాళన వికారాబాద్ నుంచి చేస్తారా? మధ్యలో నుంచి చేస్తారా అని ప్రశ్నించారు. ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ క్యాచ్‌మెంట్ ఏరియా ఎంత ఉందని అడిగారు. ప్రపంచంలో కాలుష్యంలో మూసీ 8వ స్థానంలో ఉందని తెలిపారు. మూసీ ? ఈసా నదులు కావు.. అవి ఇప్పుడు సీవరేజ్ ఎ÷-లాంట్లు అని అక్బరుద్దీన్ విమర్శించారు. నగరంలోని మురుగు అంతా మూసీ నదిలోకే వెళ్తోందని తెలిపారు. గండిపేట జలాశయంలో కూడా మురుగు నీరు కలుస్తుందని అన్నారు. దశాబ్దాల కింద నిర్మించిన ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్‌లో పూడిక తీసి, వాటి సామర్థ్యం పెంచాలని కోరారు. నీటి నిల్వ సామర్థ్యం పెంచితే గోదావరి జలాలను తరలించవచ్చని తెలిపారు. చార్మినార్ వద్ద మూడేళ్ల కిందట మొదలుపెట్టిన పెడస్ట్రేరియన్ ప్రాజెక్టు ఏమైందని ప్రశ్నించారు.

## సంక్రాంతి రద్దీ దృష్ట్యా టోల్ వసూళ్లు ఆపండి

**కేంద్రమంత్రి గడ్కరీని కోరిన ఎంపి సనా సతీశ్**

**అమరావతి, జనవరి 2 :** సంక్రాంతి సందర్భంగా టోల్‌ప్లాజాలో టోల్ వసూళ్లను నిలిపివేయాలంటూ కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని టీడీపీ ఎంపీ సనా సతీష్ కోరారు. సంక్రాంతికి హైదరాబాద్, ఇతర ప్రాంతాల నుంచి లక్షలాది మంది ఏపీలోని సొంత గ్రామాలకు వస్తారని.. ఫలితంగా హైదరాబాద్-విజయవాడ రహదారిపై విపరీతమైన రద్దీ ఉంటుందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని టోల్ వసూళ్లు నిలిపివేయాలని కేంద్రాన్ని కోరారు. సంక్రాంతి పండుగ కారణంగా హైదరాబాద్‌లో ఉంటున్న ఏపీ వాసులు పెద్ద ఎత్తున తమ తమ స్వస్థలాలకు వెళ్తుంటారని.. ఫలితంగా హైదరాబాద్-విజయవాడ రహదారిపై తీవ్రమైన ట్రాఫిక్ రద్దీ ఏర్పడుతుందన్నారు ఎంపీ సనా సతీష్. ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. పంతంగి, కొర్లపహాడ్, చిల్లకల్లు, కీసర టోల్ ఎ÷-లాజాల వద్ద విపరీతమైన రద్దీ ఏర్పడి గంటల తరబడి ట్రాఫిక్ స్తంభించి పోతుందన్నారు. ఈ కారణంగా తెలుగు ప్రజలకు సమయం ఆదా అవ్వడం, ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు టోల్ లాజాల వద్ద టోల్ వసూళ్లను మాఫీ చేయాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు ఎంపీ సనా సతీష్.

## సిఎం రేవంత్ తీరు దారుణం

**కసబ్‌లాగా ఉరితీయాలని అంటారా : మండిపడ్డ ఎమ్మెల్యే సంజయ్**

**హైదరాబాద్, జనవరి 2 :** అసెంబ్లీలో కాంగ్రెస్ ప్రభుత్వం పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌పై కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ మండిపడ్డారు. నదీజలాలపై పీపీటీలో పాయింట్ లేదని విమర్శించారు. అందులో అధికార బలం, అహంకారం తప్ప ఏమీ లేదని అన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద శుక్రవారం మాట్లాడిన ఆయన.. సీఎం రేవంత్ రెడ్డి తీరుపై విమర్శలు గుప్పించారు. రేవంత్ రెడ్డి బైపోలార్ డిజార్డర్‌తో బాధపడుతున్నాడని ఎమ్మెల్యే సంజయ్ విమర్శించారు. ఒక్కటే ప్రెస్‌మీట్‌లో ఒకసారి అసెంబ్లీకి రావాలి అంటాడు, వెంటనే ఉరి తీయాలి అంటాడని మండిపడ్డారు. అసెంబ్లీకి వస్తే గౌరవం ఇస్తానని అంటున్నాడు.. అంటే రేవంత్ రెడ్డి ఇప్పటివరకు అగౌరవంగానే ప్రవర్తించాడని అర్థం కదా అని ప్రశ్నించారు. కసబ్ లెక్క ఎవరిని ఉరితీస్తారో ప్రజలే నిర్ణయిస్తారని తెలిపారు. రేవంత్ రెడ్డి మూర్ఖపు మాటలకు ప్రజలు ఈసారి ఆయనను కసబ్ లాగా ఉరి తీస్తారని అన్నారు. అసెంబ్లీ, పార్లమెంట్‌లో ప్రతిపక్ష నాయకులకు గౌరవం ఉంటుందని అన్నారు. అసెంబ్లీ రూల్స్ మొత్తం ఈయనే రూల్ చేసినట్లు మాట్లాడుతున్నాడని మండిపడ్డారు. పాలమూరు బిడ్డగా పాలమూరును కాపాడుకునే అవకాశం వచ్చిందని సీఎం రేవంత్ రెడ్డికి తెలిపారు. ఇప్పటికైనా ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కేసీఆర్ వచ్చి సలహాలు ఇవ్వాలని రేవంత్ రెడ్డి అంటున్నాడని.. మరి జూరాల ప్రాజెక్టు కింద క్రాప్ హాలీడే ప్రకటించింది మీ ప్రభుత్వమే కదా అని ప్రశ్నించారు. కేఎల్ఐలో ఇప్పటికీ పుష్కలంగా నీళ్లు ఉన్నాయని తెలిపారు. కానీ ఆదిత్యనాథ్ దాస్ సలహాతో జూరాల నుంచి లిఫ్ట్ చేయాలని అంటున్నాడని పేర్కొన్నారు. దయచేసి ఇప్పటికైనా మంచి సలహాదారుడిని పెట్టుకోవాలని సూచించారు. ఆంధ్రా అడ్వైజర్‌ను తీసేసి తెలంగాణ అడ్వైజర్‌ను పెట్టుకోవాలని అన్నారు. నీళ్లకు సంబంధించి పక్క రాష్ట్రంతో మనకు ఉన్న సమస్యలు పరిష్కారం కావాలంటే తెలంగాణ సోయి ఉన్నోడు అడ్వైజర్‌గా ఉండాలని స్పష్టం చేశారు. నికర జలాలు ఉండగా, వరద జలాల నుంచి లిఫ్ట్ ఎలా చేస్తారని ఎమ్మెల్యే సంజయ్ ప్రశ్నించారు. ఇప్పటికే ఒక మోటార్ ద్వారా వాటర్ లిఫ్ట్ చేశామని గుర్తుచేశారు. ఇవాళ, రేపు పాలమూరు ? రంగారెడ్డి ప్రాజెక్టుపై చర్చ పెట్టాలని డిమాండ్ చేశారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి ఇరిగేషన్ గురించి అర్థం కావడం లేదని ఎమ్మెల్యే సంజయ్ ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా బాగా ప్రిపేర్ అయ్యి సభకు రావాలని సూచించారు.

## నేడు తెలంగాణ భవన్‌లో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్

- బిఎసి నిర్ణయాలకు విరుద్ధంగా సమావేశాల నిర్వహణ
- హరీష్ రావు వెల్లడి

**హైదరాబాద్, జనవరి 2 :** అసెంబ్లీ సమావేశాలను బహిష్కరించాలని బీఆర్ఎస్ నిర్ణయించింది. ఈ మేరకు ఆ పార్టీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు, స్పీకర్ వైఖరికి నిరసనగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. శాసనసభ నుంచి వాకౌట్ చేసిన అనంతరం గన్‌పార్క్ వద్ద పార్టీ ఎమ్మెల్యేలతో కలిసి హరీశ్‌రావు నిరసన తెలిపారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడారు. తీవ్ర నిరసన వ్యక్తం చేస్తూ సభ నుంచి బయటకు వచ్చాం. ప్రజాస్వామ్య విలువలకు అధికార పక్షం పూర్తిగా తిలోదకాలు ఇచ్చింది. బీఏసీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలకు విరుద్ధంగా సభ నిర్వహిస్తున్నారు. సభను సీఎం రేవంత్ బూతుల మయం చేశారు. ఆయన వ్యాఖ్యలపై నిరసన తెలిపేందుకు ప్రధాన ప్రతిపక్షంగా మాకు అవకాశం ఇవ్వలేదు. సీఎంను విమర్శించవద్దని స్పీకర్ అంటే ఎలా? ప్రధానిని రాహుల్‌గాంధీ విమర్శించడం లేదా? మూసీ కంటే ముందు సీఎం నోరు ప్రక్షాళన చేయాలి. అసెంబ్లీని గాంధీభవన్, సీఎల్పీ సమావేశంలా రేవంత్ మారుస్తున్నారు. మేం ప్రశ్నిస్తే అడ్డగోలుగా చిల్లర మాటలు మాట్లాడుతున్నారని హరీశ్‌రావు విమర్శించారు. ఈ క్రమంలో నేటి అసెంబ్లీ సమావేశాన్ని బహిష్కరించాలని బీఆర్ఎస్ పార్టీ నిర్ణయం తీసుకుంది. రేపటి సభకు హాజరు కావొద్దని పేర్కొన్నారు. శనివారం ఉదయం తెలంగాణ భవన్ లో కృష్ణా నదీ జలాలు, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుపై బీఆర్ఎస్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వనుంది. బీఏసీలో మాట్లాడిన మాటలు, తీసుకున్న నిర్ణయాలు వేరు అసెంబ్లీలో పెట్టినవి వేరు.. బీఏసీలో తీసుకున్న నిర్ణయాలు పెట్టకుండా సభను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. మూసీకి సంబంధించి కొన్ని ప్రశ్నలను సభలో సంధించాం.. వాటిపై సమాధానాలు ఇవ్వకుండా సీఎం మాట్లాడుతున్నారు.. అసెంబ్లీని సీఎం బూతులమయం చేశాడని ఎద్దేవా చేశారు. ఇలా మాట్లాడిన స్పీకర్ ఆయనకి అడ్డు చెప్పలేదు.. బీఆర్ఎస్ కి సభలో మాట్లాడే అవకాశం ఇవ్వకపోతే ఇక సభకు ఎందుకు రావాలని హరీష్ రావు ప్రశ్నించారు.

## ముఖ్యమంత్రికి డబ్బా కొట్టాలా?

**స్పీకర్ తీరుపై జగదీశ్ రెడ్డి అసహనం**

**హైదరాబాద్, జనవరి 2 :** అసెంబ్లీలో మూసీ ప్రక్షాళనపై చర్చ సందర్భంగా బీఆర్ఎస్ నేతలు అడిగిన ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానాలు ఇవ్వలేకపోయిందని మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి మండిపడ్డారు. ఈ అంశంపై సీఎం మాట్లాడిన తర్వాత మాట్లాడేందుకు బీఆర్ఎస్‌కు అవకాశం ఇవ్వలేదు. బీఆర్ఎస్ సభ్యులు ముఖ్యమంత్రిని దూషిస్తున్నారని, ముఖ్యమంత్రిని దూషిస్తానంటే మైక్ ఇవ్వనని స్పీకర్ చెప్పారు. దాంతో బీఆర్ఎస్ సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారని అన్నారు. ముఖ్యమంత్రిని విమర్శిస్తానంటే మైక్ ఇవ్వనన్న స్పీకర్ వ్యాఖ్యలపై మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి తప్పుపట్టారు. ముఖ్యమంత్రిని విమర్శించకపోతే ప్రతిపక్షం ఎక్కడన్నా ముఖ్యమంత్రికి డబ్బా కొడుతదా..అని ఆయన ప్రశ్నించారు. ముఖ్యమంత్రిని విమర్శిస్తే మైక్ ఇవ్వకపోవడం ఏంటని నిలదీశారు. సభ్యులు ముఖ్యమంత్రిని పొగడడానికి సభకు వస్తారా..? అంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. ముఖ్యమంత్రి మూసీ కంపును అంతా తీసుకొచ్చి తన నోటి ద్వారా అసెంబ్లీలో వదిలిండని విమర్శించారు. ప్రధానమైన ప్రతిపక్షంగా తాము ప్రజల తరుపున ప్రశ్నలు అడుగుతామని అన్నారు. పేద ప్రజల ఇళ్లు కూలకొడితే వాళ్లకు అండగా ఉంటామని చెప్పారు. ముఖ్యమంత్రి ఇష్టం వచ్చినట్లు దాడిచేసి, మాకు మైక్ ఇవ్వకుండా వేరే ప్రతిపక్షానికి అవకాశం ఇవ్వడం ఏంటని మండిపడ్డారు. సబితా ఇంద్రారెడ్డిగారు, సునీతా లక్ష్మారెడ్డిగారు మూసీ ప్రస్తావన తీసుకురాగానే వారి మైక్ కట్ చేశారని చెప్పారు. స్పీకర్ వైఖరికి నిరసనగా తాము సభను బాయ్ కాట్ చేశామని తెలిపారు.

## నేడు కొండగట్టుకు డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్

**టిటిడి నిధులతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన**

**అమరావతి, జనవరి 2 :** ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ శనివారం తెలంగాణ రాష్ట్రంలోని కొండ గట్టు ఆంజనేయ స్వామి క్షేత్రానికి కళ్యాణ్ వెళ్లనున్నారు. సీఎం చంద్రబాబు నాయుడు సహకారం, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చొరవతో తెలంగాణలోని కొండగట్టు ఆంజనేయ క్షేత్రానికి తిరుమల తిరుపతి దేవస్థానం టీటీడీ నిధులు మంజూరు చేసింది. టీటీడీ నుంచి రూ.35.19 కోట్ల నిధులతో సత్రం, దీక్షా విరమణ మండపం నిర్మాణాలు చేయనున్నారు. ఈ క్రమంలోపవన్ కళ్యాణ్ కొండగట్టుకు వెళ్లి.. ఈ నిర్మాణాల పనులకు శంకుస్థాపన చేయనున్నారు. శనివారం ఉదయం 10గం.30ని. నుంచి 11 గం.30ని. మధ్య డిప్యూటీ సీఎం పవన్ కొండగట్టు క్షేత్రంలో పర్యటించనున్నారు. గతంలో ఎన్నికల్లో విజయం సాధించిన తర్వాత కొండగట్టు ఆంజనేయ స్వామిని దర్శించుకున్న పవన్.. ముక్కులు చెల్లించుకున్నారు. ఆ సమయంలో అక్కడ నిర్మాణాలకు సంబంధించిన అంశాలను అర్చకులు పవన్‌కు వివరించారు. కొండగట్టు క్షేత్రంలో నిర్మాణాలపై సీఎం చంద్రబాబుతో పవన్ సమావేశమయ్యారు. టీటీడీ సహకారంతో కొండగట్టు క్షేత్రంలో నిర్మాణాలు చేయాలని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సీఎం చంద్రబాబును కోరారు. చంద్రబాబు ఆదేశాలతో టీటీడీ చైర్మన్ తో పవన్ చర్చించారు. అనంతరం రూ.35.19 కోట్లు మంజూరుకు టీటీడీ బోర్డు అంగీకారం తెలిపింది. నిధులతో కొండగట్టు ఆలయంలో దీక్ష విరమణ మండపం, 96 గదుల సత్రం నిర్మాణాలు చేపట్టనున్నారు. ఒకేసారి 2 వేల మంది భక్తులు దీక్షలు విరమించేలా మండపాన్ని నిర్మించనున్నారు.

# విప్లవాత్మక నిర్ణయాలకు ఇదే సమయం !



**క్యాలెండర్లు మారుతూ ఉంటాయి. అయితే ప్రజల జీవితాలు ఏ మే-రకు మారాయి.. ఎంత మేరకు మనం చేసిన పాలన ప్రజల ఇతోధిక అభివృద్ధికి దోహదపడిందో అన్నది పాలకులు ఆత్మపరిశీలన చేసుకోవాలి. ఏటేటా ప్రజల జీవనం చిద్రం అవుతున్నా, సరైన నిర్ణయాలు తీసుకోక పోవడం వల్ల దేశం నానాటికీ దిగజారి పోతోంది. అన్ని రంగాలు కుదేలవుతున్నాయి. ప్రధానంగా విద్య,వైద్యరంగాల్లో పెనుమార్పులు ఏవీ కానరావడం లేదు. ఇదంతా కేవలం పాలకులు లోపభూయిష్ట నిర్ణయాల కారణంగానే చూడాలి. ప్రభుత్వాలు వస్తున్న ఆదయాలను అభివృద్ది వైపు కాకుండా ఓటు బ్యాంక్‌కు ఉయోగపడే పథకాలకు మళ్లించడం వల్ల అప్పుల్లో కూరుకుపోతున్నాం.**

దేశం యావత్తూ ఇదే పరిస్థితి ఉంది. సంక్షేమం పేరుతో చేస్తున్న విన్యాసాల కారణంగా పురోగమనం తగ్గింది. కనీసం రోడ్లు వేయలేని దురవస్థలు చూస్తున్నాం.తెలుగు రాష్ట్రాల్లోనూ పరిస్థితులు ఆందోళనకరంగానే ఉన్నాయి. పరిశ్రమల ఏర్పాటుకానీ, ఉపాధి కల్పన కానీ ప్రజల ఆకాంక్షలకు తగ్గట్టుగాలేవు. దీంతో ప్రజల జీవన ప్రమాణాలు ఏమాత్రం పెరగడం లేదు. మరోవైపు పరిశ్రమల పేరు చెప్పి, కార్పొరేట్లకు భూ సంతర్పణ కొనసాగుతోంది. గిట్టుబాటు ధరలు లేక రైతాంగం ఆందోళన చెందుతోంది. ప్రభుత్వ వైద్య రంగాన్ని కార్పొరేట్లకు అప్పచెప్పడానికి పాలకులు పరుగులు తీస్తున్నారు. విశాఖ ఉక్కును ప్రైవేటీకరించే కుట్రలు ఆగలేదు. 2025లో జరిగిని తీరును చూస్తూ 2026లో ఏదో అద్భుతం జరుగుతుందని అనుకోవడానికి లేదు. నూతన సంవత్సరం 2026లోకి అడుగుపెట్టాం. గత కాలపు అనుభవాలు పాఠాలుగా మార్చుకోవడానికి, గుణపాఠాలు నేర్చుకుని ముందుకు అడుగు వేయడానికి ఇది సరైన సమయం! 2025వ సంవత్సరం మన ముందుంచిన కఠోర వాస్తవాలు నూతన సంవత్సరానికి స్పష్టమైన హెచ్చరికగా నిలుస్తున్నాయి.

అసమానతలు ప్రమాదకర స్థాయికి చేరడం, నిరుద్యోగం తీవ్రమవ్వడం, కార్పొరేట్ దురాశలతో ప్రజల జీవనాధారాలు కుదేలవడం, పాలకుల రాజకీయాలు కార్పొరేట్ల లాభాల ఆశలతో జత కలవడం ఇవన్నీ గత ఏడాది సాధారణ ప్రజల జీవితాన్ని నేరుగా ప్రభావితం చేసిన అంశాలు. దేశ సంపదలో నలభై శాతం కేవలం ఒక్క శాతం మంది వద్ద కేంద్రీకృత మవ్వడం, మరోవైపు కోట్లాది మంది కూడు,గూడు,గుడ్డ,విద్య-వైద్యం వంటి మౌలిక అవసరాలు కూడా తీరని దుస్థితి నెలకొంది. ఈ సమస్యలను పరిష్కరించాల్సిన పాలకులు దానికి భిన్నంగా తమ పాలన సాగిస్తున్నారు. విద్య, ఉపాధి రంగాలు అత్యంత దయనీయ స్థితికి చేరాయి. ఇప్పటివరకు అంతో, ఇంతో విశ్వాసం పొందిన న్యాయ వ్యవస్థ గత కాలపు ఖ్యాతి మసకబారుతుండటం ఆందోళనకర పరిణామం. నూతన విద్యావిధానం పేరుతో మూతబడిన బడులు మళ్లీ తెరుచుకోవాలని, చరిత్ర, విజ్ఞానశాస్త్రాలను పెంపొందించాలని, విద్యారంగం శాస్త్రీయ భావనలతో కొత్త పుంతలు తొక్కాలని, వేయి ఆలోచనలు వికసించి భావి తరాల ప్రగతికి బాటలు వేయాలని ప్రజలు కోరుకుంటున్నారు. ప్రజల జీవనోపాధికి గ్యారంటీ ఇచ్చే ఉద్యోగ, ఉపాధి రంగాలు కొత్త సంవత్సరంలోనైనా పూర్తిస్థాయిలో విరాజిల్లాలన్నది ప్రజల ఆకాంక్ష! గణాంకాల మాయాజాలం కాకుండా, తమ గౌరవాన్ని కాపాడే నిజమైన అభివృద్ధి జరగాలని ప్రజలు కోరుకుంటున్నారు.

ఆర్థిక సంస్కరణలతో ఇప్పటికే అరకొరగా మారిన కార్మిక హక్కులను లేబర్‌కోడ్‌లతో పూర్తిగా దిగమింగడానికి ప్రభుత్వం సిద్ధమైంది. ఎపి రాజధాని అమరావతి నగర నిర్మాణం ఇంకా భూమి చుట్టే తిరుగోతంది. రెండేళ్లు కావస్తున్నా ఉన్న భూమితో సరిపెట్టుకోకుండా రియల్ వ్యాపారం వైపు చంద్రబాబు పరుగులు తీస్తున్నారు. వెనుకబడిన ప్రాంతాలకు నిధులు, పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల పునరావాసం వంటివి జవాబులేని ప్రశ్నలుగానే మిగిలాయి. ఈ వైఫల్యాలను ప్రశ్నించి, ప్రజలకు న్యాయం కోసం గళమిప్పే శక్తుల గొంతు నొక్కడానికి ప్రభుత్వం బరితెగించడం చూస్తున్నాం. ఇకపోతే దేశంలో దళితులు, ఆదివాసులు, మహిళలు ఎదుర్కొంటున్న దాడులకు ముగింపు పలికి, సమానత్వం నిజంగా అమలుకావాలన్నది ప్రజల ఆకాంక్ష. జల్, జంగల్, జమీన్‌పై కార్పొరేట్ ఆక్రమణలు ఆగాలి. అటవీ భూముల రక్షణ, గిరిజనుల హక్కుల పరిరక్షణ జరగాలి. పట్టణాల్లో కాలుష్యం, కొండల విధ్వంసం, ప్రక తి వనరుల దోపిడీ వంటివి కేవలం పర్యావరణ సమస్యలు కావు. ఇవి జీవన, సామాజిక న్యాయ సమస్యలు. సామాన్యులను పట్టం కట్టే పర్యావరణ న్యాయంవైపు దేశం మళ్లాల్సింది. దేశ ఎన్నికల పక్రియ నూతన ఏడాదిలోనైనా నిజమైన, నిష్పక్షపాతపు ప్రజాస్వామ్యంగా మార్చాలి. దొంగ ఓట్లను, చోరబాటుదారుల ఓట్లను తొలగించాల్సిందే. అలాగే ఉచిత పథకాలను తగ్గించి, అభివృద్ధికి నిధులు వెచ్చించాలి. అదేపనిగా లెక్కుకు మించి పెన్షన్లు, తెల్ల రేషన్ కార్డులను తొలగించాలి. కొత్త సంవత్సరం ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే దిశగా ఆశావహ మలుపు తీసుకునేలా కార్యాక్రమాలను విస్తరించాలి. కేవలం పేదలకు మాత్రమే నేరుగా పథకాలు అందించాలి. దుబారా పథకాలను తగ్గించాలి. అప్పుడే దేశం బాబుపడగలదు.

# అసెంబ్లీలో కాంగ్రెస్, మజ్లీస్ కుమ్మక్కు


- **మజ్లిస్ కోసమే సభ పెట్టినట్లుగా ఉంది**
- **మండిపడ్డ బిజెపి ఎమ్మెల్యే రాకేశ్ రెడ్డి**



**హైదరాబాద్, జనవరి 2 :** అసెంబ్లీలో కాంగ్రెస్, మజ్లీస్ కుమ్మక్కు అయ్యాయని బీజేపీ ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి మండిపడ్డారు. శాసనసభలో గంటల తరబడి మైక్‌ను మజ్లీస్‌కు ఎందుకు ఇస్తున్నారని ప్రశ్నించారు. ఓవైసీ కోసమే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అసెంబ్లీ పెట్టిందా అని ఎద్దేవా చేశారు. శుక్రవారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో రాకేశ్‌రెడ్డి చిట్‌చాట్ చేశారు. కాంగ్రెస్ సెక్యులర్ పదాన్ని మరిచిపోయిందని విమర్శించారు. హిందూ ఎమ్మెల్యేలను విస్మరిస్తుందని మండిపడ్డారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక ఈ విషయాన్ని సరిదిద్దుతామని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ సర్కార్‌లో హిందూ ఎమ్మెల్యేలకు అవమానం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. హిందూ ఎమ్మెల్యేలు ఉన్న చోట అభివృద్ధి ఎందుకు జరగడం లేదని ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి ప్రశ్నల వర్షం కురిపించారు. తమ నియోజకవర్గంలో అభివృద్ధి కోసం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రూ.500 కోట్లు ఇచ్చిందని ఓవైసీ అసెంబ్లీ సాక్షిగా చెప్పారని ప్రస్తావించారు. అత్యధిక పన్ను కడుతున్న హిందువుల సొమ్మును ముస్లింలకు దోచి పెడుతున్నారని ఆరోపణలు చేశారు. మూసీ ప్రాజెక్టుకు డీపీఆర్ లేదని.. తోక లేదని ఎద్దేవా చేశారు. దోచుకోవడానికి అప్పుడు కాళేశ్వరం.. ఇప్పుడు మూసీని తెరమీదకు తెచ్చారని దెప్పిపొడిచారు. గ్రామీణ తెలంగాణను కాంగ్రెస్ ప్రభుత్వం ధ్వంసం చేస్తోందని ఆరోపణలు చేశారు. భూముల ధరలు పెంచుకునేందుకే.. గ్రామాలను పట్టణీకరణ చేస్తోందని అన్నారు ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి.కాళేశ్వరం, పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టులతో నిజామాబాద్ జిల్లాకు ఒరిగిందేమి లేదని విమర్శించారు. నిజామాబాద్ జిల్లాకు నష్టం చేయొద్దని హితవు పలికారు. నిజాంసాగర్ పునరుద్ధరణకు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ రెండేళ్ల పుణ్యకాలం గడిచిపోయిందని ఎద్దేవా చేశారు. ఐదేళ్ల కాంగ్రెస్ పాలన డీపీఆర్‌లకే సరిపోతుందని విమర్శించారు. పెద్ద పెద్ద ప్రాజెక్టులు పూర్తికావాలంటే డబుల్ ఇంజన్ సర్కార్ వల్లే సాధ్యమని ధీమా వ్యక్తం చేశారు. అభివృద్ధి పనుల నిమిత్తం ఒక్కో నియోజకవర్గానికి రూ. 25కోట్లు ఇవ్వాలని కాంగ్రెస్ ఎమ్మెల్యేలే అడుగుతున్నారని చెప్పుకొచ్చారు. ప్రజలను మభ్యపెట్టేందుకే అసెంబ్లీ సమావేశాలు పెట్టారని విమర్శించారు ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి. బీఆర్ఎస్ అవినీతి ఎక్కడ బయట పడుతుందోనని అసెంబ్లీ నుంచి ఆ పార్టీ నేతలు వాకౌట్ చేశారని ఎద్దేవా చేశారు. చిన్న అంశంపైన భయపడి వాకౌట్ చేస్తే ఎలా? అని ప్రశ్నల వర్షం కురిపించారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టుకి జాతీయ హోదా కల్పిస్తామని స్పష్టం చేశారు. దర్యాప్తు సంస్థలకు హరీశ్‌రావు, కవితలపై ఫిర్యాదు చేయాలని సూచించారు. కవిత సరైన ఆధారాలతో హరీశ్‌రావుపై ఫిర్యాదు చేస్తానంటే తాను సపోర్టు చేస్తానని స్పష్టం చేశారు. మండలి చైర్మన్ తక్షణమే కవిత రాజీనామాను ఆమోదించాలని డిమాండ్ చేశారు. కవిత రాజీనామా ఆమోదించకపోవడంతో శాసన వ్యవస్థ మీద ప్రజలకు నమ్మకం పోతుందని చెప్పుకొచ్చారు. మండలి చైర్మన్‌ను తాను కలిసి కవిత రాజీనామా ఆమోదించాలని కోరుతానని పైడి రాకేశ్‌రెడ్డి పేర్కొన్నారు.

## ఈవీఎంలపై దుమారం వేళ
# కర్నాటకలో ఊహించని షాక్

- **ఈవీఎంల పనితీరుపై జనం సంతృప్తి వ్యక్తం**
- **రాహుల్ తరచూ విమర్శలపై బిజెపి ఫైర్**




**బెంగళూరు,జనవరి2 :** ఈవీఎంలపై దుమారం రేపుతున్న కాంగ్రెస్‌కు అశనిపాతం లాంటి అనుభవం ఎదురయ్యింది. అది కూడా తమ పార్టీ అధికారంలో ఉన్న కర్నాటక నుంచే రావడం విశేషం. ఎన్నికల పక్రియలో విశ్వసనీయత, ఈవీఎంల పనితీరుపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తరచూ విమర్శలు వ్యక్తం చేస్తోన్న వేళ.. కర్ణాటకలో చేపట్టిన ఓ ప్రభుత్వ సర్వే ఫలితాలు చర్చనీయాంశంగా మారాయి. ఆ సర్వేలో రాష్ట్రంలోని మెజార్టీ ప్రజలు ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్ లను విశ్వసిస్తున్నట్లు తేలింది. దీంతో రాహుల్ గాంధీపై భాజపా విమర్శలు గుప్పించింది. ఇవిఎంలను తప్పు పట్టడం ద్వారా రాహుల్ రాజకీయం బయటపడిందని విమర్శలకు పదను పెట్టింది. 2024లో జరిగిన సార్వత్రిక ఎన్నికలపై కర్ణాటక ప్రభుత్వ ఏజెన్సీ కేఎంఈఏ కర్ణాటక మానిటరింగ్ అండ్ ఎవల్యూషన్ అథారిటీ గతేడాది ఆగస్టులో సర్వే నిర్వహించింది. ఆ రిపోర్ట్‌ను తాజాగా విడుదల చేసింది. దీని ప్రకారం..ఈవీఎంలు విశ్వసించదగినవేనని 83.61శాతం మంది వెల్లడించినట్లు తేలింది. ఇక, ఈ యంత్రాలు కచ్చితమైన ఫలితాలను ఇస్తాయని 69.39 శాతం మంది అంగీకరించినట్లు నివేదిక తెలిపింది. దేశవ్యాప్తంగా ఎన్నికలు స్వేచ్ఛగా, పారదర్శకంగా జరిగాయని 91.31 శాతం విశ్వసించినట్లు సర్వే పేర్కొంది. ఈ సర్వేలో 102 అసెంబ్లీ నియోజవర్గాలకు చెందిన దాదాపు 5,100 మంది పాల్గొన్నారు. బెంగళూరు, బెళగావి, కలబురగి, మైసూరు డివిజన్లలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల ప్రజలను సర్వే చేసి ఈ నివేదిక రూపొందించారు. ఈ సర్వే ఫలితాలపై కర్ణాటక ప్రతిపక్ష నేత, భాజపా నాయకుడు ఆర్.అశోక్ స్పందిస్తూ కాంగ్రెస్ పార్టీ, రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. భారత ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉందని, ఈవీఎంలు నమ్మదగినవి కావని గత కొన్నేళ్లుగా రాహుల్ గాంధీ ఒకే పాట పాడుతున్నారు. మన సంస్థలను ఆయన విశ్వసించడం లేదు. కానీ, ఆయన మాట తప్పని కర్ణాటక రుజువు చేసింది. ఎన్నికలను, ఈవీఎంలను, మన ప్రజాస్వామ్య పక్రియను ప్రజలు నమ్ముతున్నారు. ఈ సర్వే కాంగ్రెస్‌కు చెంపపెట్టు. ప్రజాభిప్రాయం ఎలా ఉందో తెలిసినా.. సిద్ధరామయ్య ప్రభుత్వం మాత్రం స్థానిక ఎన్నికలను బ్యాలెట్ విధానంలో నిర్వహిస్తామని ప్రకటించడం హాస్యాస్పదం అన్నారు.

# టూవీలర్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

**ప్రమాదంలో దంపతుల దుర్మరణం**

**హైదరాబాద్, జనవరి 2 :** ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో బైక్‌పై వెళ్తున్న భార్యాభర్తలు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఘటన మలక్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని వాహేద్ నగర్‌లో చోటు చేసుకుంది. సూర్యాపేట జిల్లాకు చెందిన తిరుపతిరావు, వెంకటమ్మ దంపతులు ఇటీవల దిల్‌స-ుఖ్‌నగర్ కొత్తపేటలో నివసిస్తున్న తమ కుమార్తె వద్దకు వచ్చారు. గురువారం సాయంత్రం ట్యాంక్ బండ్ చూసేందుకు వారు బైక్‌పై బయలుదేరారు. మూసారాంబాగ్ హైటెక్స్ మోటర్స్ సమీపంలో.. వెనుక నుంచి వేగంగా వచ్చిన దిల్‌సుఖ్‌నగర్ డిపోకు చెందిన ఆర్టీసీ ఆర్డినెరీ బస్సు.. వీరు ప్రయాణిస్తున్న బైక్‌ను ఢీకొట్టింది. దంపతులు రోడ్డుపై పడిపోయారు. వారిపై నుంచి బస్సు వెనుక టైర్ వెళ్లడంతో తిరుపతిరావు, వెంకటమ్మ దంపతులు అక్కడికక్కడే మరణించారు. ఈ ప్రమాదంపై స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు హుటాహుటిన ఘటన స్థలానికి నిలిచిపోయిన ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. అనంతరం మృతదేహాలను స్వాధీనం చేసుకుని.. పోస్ట్‌మార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అలాగే కొత్తపేటలోని మృతుల కుమార్తెకు సైతం ఈ సమాచారం అందించారు.

## బొలెరోను ఢీకొన్న ఐచర్ వ్యాన్

- **ప్రమాదంలో ఇద్దరు మృతి**
- **నంద్యాల వద్ద బస్సు బోల్తా ఘటనలో ప్రయాణికులకు గాయాలు**

**అనంతపురం, జనవరి 2 :** మడకశిర మండలం అగ్రంపల్లి గ్రామం సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. బొలెరో గూడ్స్ వాహనాన్ని ఐచర్ వ్యాన్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆ వాహనాల్లో ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మరణించారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. అదే రహదారిపై వెళుతున్న వాహనదారులు వెంటనే స్పందించి.. పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. వారి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు వెల్లడించారు. మృతదేహాలను స్వాధీనం చేసుకుని.. పోస్ట్‌మార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుల్లో ఒకరు మడకశిర పట్టణానికి చెందిన వడ్రపాలెం రఘురాం, మరొకరు సీకే పల్లికి చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు. ఈ ప్రమాదంపై ఆయా కుటుంబ సభ్యులకు పోలీసులు సమాచారం అందించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నంద్యాల జిల్లాలోని చాబోలు వద్ద జాతీయ రహదారిపై ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆరుగురు ప్రయాణికులు గాయపడ్డారు. స్థానికులు వెంటనే స్పందించి.. వారిని సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. రహదారిపై ట్రాఫిక్ జామ్ కావడంతో.. వాహనాలు బారులు తీరాయి. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను నియంత్రించారు.

# శబరిమల బంగారం చోరీ వ్యవహారం

- **దొరికింది తక్కువే అన్న అనుమానంలో సిట్**
- **మరింత లోతుగా దర్యాప్తునకు రంగం సిద్ధం**

**తిరువనంతపురం, జనవరి 2 :** శబరిమల ఆలయ పునరుద్ధరణ పనుల్లో చోరీకి గురైన బంగారంలో ఇప్పటివరకు దొరికినదానికంటే ఇంకా ఎక్కువే పోయి ఉంటుందని ప్రత్యేక దర్యాప్తు బృందం సిట్ అనుమానిస్తోంది. ఇప్పటి వరకుఎ రికవరీ జరిగిన సొత్తు విలువ అంచనా వేస్తున్నారు. ఇంకా ఎక్కడెక్కడ ఉందా అని ఆరా తీస్తున్నారు. ముగ్గురు నిందితుల్ని తమ కస్టడీకి అప్పగించాల్సిందిగా కోరుతూ కొల్లం విజిలెన్స్ కోర్టుకు సమర్పించిన దరఖాస్తులో సిట్ ఈ అనుమానం వ్యక్తం చేసింది. 2019లో బంగారం పూత పూసిన రాగి రేకులను ఎలక్ట్రో ప్లేటింగ్ కోసం స్మార్ట్ క్రియేషన్స్ సంస్థకు అప్పగించారని సిట్ తన పిటిషన్‌లో పేర్కొంది. ఆ ప్లేట్ల మొత్తం బరువు 42.100 కేజీలు కాగా ఎలక్ట్రోప్లేట్రింగ్ పక్రియ పూర్తైన తర్వాత మిగిలిన బంగారాన్ని నిందితులు మింగేశారని అభియోగం. ద్వారపాలక విగ్రహాల నుంచి, వాటికి సమీపంలోని రెండు స్తంభాల నుంచి బంగారం పూసిన రేకుల్ని తొలగించారని, గర్భగుడి ద్వారం నుంచి ఇలాంటి ఏడు రేకులు తొలగించి వాటికి బంగారు పూత తిరిగి పూశారని సిట్ కోర్టుకు తెలిపింది. గర్భగుడి నుంచి తొలగించిన ప్లేట్లలో రెండింటిపై విష్ణుమూర్తి దశావతారాలు చెక్కి ఉన్నాయని వివరించింది. ఎలక్ట్రోప్లేట్రింగ్ అనంతరం ఉన్నికృష్ణన్ పొట్టి తనకు 474.90 గ్రాముల బంగారం ఇచ్చాడని గోవర్ధన్ అనే మరో నిందితుడు తెలియజేసి ఆమేరకు సిట్‌కు బంగారం అప్పగించాడు. ద్వారపాలక విగ్రహాలపై ఉన్న బంగారు పూసిన రాగి ప్లేట్లపై వాస్తవానికి ఇంకా ఎక్కువ పరిమాణంలో బంగారం ఉందని సిట్ వెల్లడించింది. ఈ కేసులో బంగారాన్ని దొంగిలించిన వ్యక్తి, కొన్న వ్యక్తి కూడా కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీని ఎలా కలవగలిగారని ముఖ్యమంత్రి పినరయి విజయన్ ప్రశ్నించారు.

## నవజాత శిశువు మృతి

**ఖమ్మం, జనవరి 2 :** డాక్టర్, సిబ్బంది నిర్లక్ష్యంతో 5 రోజుల నవజాత శిశువు మృతి చెందిన ఘటన ఖమ్మం జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది.దీంతో బంధువులు కుటుంబ సభ్యులు ప్రైవేట్ ఆస్పత్రి ముందు ఆందోళనకు దిగారు. మేనేజ్ మెంట్ నిర్లక్ష్యంవల్లే తమ శిశువు చనిపోయిందని ఆరోపించారు. ఖమ్మంలోని ముస్తాఫానగర్ కు చెందిన బాలింత లావణ్య డిసెంబర్ 30నర మగశిశువుకు జన్మనిచ్చింది. శిశువు పాలు కక్కుతుండటంతో స్థానిక గాంధీచౌక్ లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లింది. చికిత్స పొందుతున్న క్రమంలో శిశువు పరిస్థితి మరింత క్షీణించడంతో ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లాలని అక్కడి సిబ్బంది చెప్పారు. దీంతో హుటాహుటిన ఖమ్మ జిల్లా ప్రభుత్వాస్పత్రిలోని మాతా శిశు కేంద్రానికి శిశును తరలించగా.. అప్పటికే చనిపోయినట్లు డాక్టర్లు చెప్పారు. దీంతో శిశువు మృతదేహంతో ప్రైవట్ ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు.

## మహారాష్ట్ర బీడ్ జిల్లాలో దుర్ఘటన

**బావిలోకి దూకి కుమారుడితో సహా తల్లి మృతి**

**ముంబై, జనవరి 2 :** మహారాష్ట్ర బీడ్ తాలుకాలో లింబారుయ్ గ్రామ సమీపంలోని వస్తీ ప్రాంతంలో దారుణం చోటు చేసుకుంది. మూడున్నరేళ్ల కుమారుడు వేదాంత్‌తో కలిసి కన్నతల్లి ప్రజక్త రామేశ్వర్ దరాడే (23) నూతిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. బుధవారం ఉదయం ఇంటి నుంచి కుమారుడితోపాటు ఆమె బయటకు బయటకు వెళ్లింది. ఇంటికి తిరిగి ఎంతసేపటికి రాకపోవడంతో.. కుటుంబ సభ్యులు వారి కోసం పరిసర ప్రాంతాల్లో గాలించారు. వారి ఆచూకీ ఎక్కడ లభ్యం కాలేదు. ఇంటికి300 మీటర్ల దూరంలోని బావిలో చూడగా.. రామేశ్వర్ దరాడే విగత జీవిగా పడి ఉంది. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకుని.. మహిళ మృతదేహాన్ని వెలికి తీశారు.నూతిలో నీరు అధికంగా ఉండడంతో.. ఆమె కుమారుడి ఆచూకీ కోసం పోలీసులు ప్రయత్నించి విఫలమయ్యారు. దీంతో ఐదు విద్యుత్ మోటర్లు ఏర్పాటు చేసి.. నూతిలోని నీటిని బయటకు తీశారు. అనంతరం బాలుడి మృతదేహాన్ని బావిలో పోలీసులు కనుగొన్నారు. ఆ మృతదేహన్ని సైతం బయటకు తీశారు. ఆ తర్వాత ఈ మృతదేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం బిడ్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## బండారం బయటపడుతుందన్న భయం

**అందుకే బాయకాట్ చేసిన బిఆర్ఎస్: జూపల్లి**

**హైదరాబాద్, జనవరి 2 :** బీఆర్ఎస్ అసెంబ్లీ సెషన్‌ను బాయ్ కాట్ చేయడంపై మంత్రి జూపల్లి కృష్ణారావు ÷ర్ అయ్యారు. శుక్రవారం అసెంబ్లీ మీడియా పాయింట్ దగ్గర ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పలాయన వాదం పాటిస్తోందని.. అసెంబ్లీ సెషన్‌ను బాయ్‌కాట్ చేయడం పలాయన వాదమేనని అన్నారు. అసెంబ్లీలో కృష్ణా జలాలపై చర్చ జరిగితే తమ బండారం బయటపడుతుందనే సెషన్ బాయ్‌కాట్ డ్రామా పేరుతో పారిపోయారని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలోనే కృష్ణా జలాల విషయంలో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. కృష్ణా జలాల్లో తెలంగాణకు 299 టీఎంసీలు చాలని సంతకం చేసి కేసీఆర్ తెలంగాణకు మరణ శాసనం రాశారని విమర్శించారు. కృష్ణా జలాలపై పోరాటం చేస్తామన్న కేసీఆర్ అసెంబ్లీ సమావేశాలు జరుగుతుంటే ఎక్కడున్నారని ప్రశ్నించారు. కృష్ణా జలాలపై పార్టీ కార్యాలయంలో మాట్లాడటం కాదని.. అసెంబ్లీకి వచ్చి చర్చలో పాల్గొనాలని కేసీఆర్?కు సవాల్ విసిరారు. అసెంబ్లీలో కృష్ణా జలాలపై చర్చ జరిగితే బీఆర్ఎస్ చేసిన అన్యాయం బయటపడుతోందని ఆ పార్టీ బాయ్ కాట్ పేరుతో డ్రామాలు ఆడుతోందని విమర్శించారు.

# యూరియల కొరతపై ప్లకార్డులతో ప్రదర్శన

**హైదరాబాద్, జనవరి 2 :** రాష్ట్రంలో యూరియా సంక్షోభంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఆందోళన చేపట్టారు. యూరియా కొరతకు నిరసనగా ప్లకార్డులు పట్టుకుని శాసనసభలో నిరసన తెలిపారు. షాపుల్లో దొరకని యూరియా యాప్‌ల్లో దొరుకుతుందా?, కాంగ్రెస్ వచ్చింది.. యూరియా కొరత వచ్చిందని ప్లకార్డులు ప్రదర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.ప్లకార్డులతో శాసన సభకు వచ్చిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను పోలీసులు అడ్డుకున్నారు. ప్లకార్డులతో లోనికి వెళ్లవద్దని సూచించారు. ఈ క్రమంలో పోలీసులతో వాగ్వాదం జరిగింది. నేను మాట్లాడిన తర్వాతనే మీకు సరెండర్ లీవ్‌ల డబ్బులు వచ్చాయి.. ఇప్పుడు యూరియా మీద కూడా రైతుల పక్షాన మాట్లాడితేనే యూరియా వస్తుందని ఎమ్మెల్యే హరీశ్‌రావు స్పష్టం చేశారు. యూరియా కొరతపై అసెంబ్లీలో చర్చించాలని డిమాండ్ చేశారు.ఈ క్రమంలో పోలీసులతో వాగ్వాదం జరిగింది.



## ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో రోడ్డు భద్రతాపై అవగాహన

**బాన్సువాడ, రాజముద్ర న్యూస్ :** జిల్లా రవాణా అధికారి (డిటిఓ) జె. శ్రీనివాస్ ఆదేశాల మేరకు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం రోడ్డు భద్రత మరియు అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఫారుక్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రవాణా శాఖ అధికారులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. సహాయక మోటార్ వెహికల్స్ ఇన్‌స్పెక్టర్లు కె. మధుకర్, ఉదయ్ కుమార్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ రోడ్డు భద్రత ప్రాముఖ్యతను వివరించారు. ఏఎంవిఐ కె మధుకర్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ప్రధమ చికిత్సపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల్లో గోల్డెన్ అవర్ ప్రాముఖ్యత, గుడ్ సమారిటన్‌కు ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలను విద్యార్థులకు వివరించారు. ఉదయ్ కుమార్ విద్యార్థుల చే రహదారి భద్రతా ప్రతిజ్ఞా చేయించారు. ప్రిన్సిపాల్ ఫరుక్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించాల్సిన అవసరాన్ని హితవు పలికారు. తల్లిదండ్రులు కూడా హెల్మెట్ ధరించే అలవాటు ఉండేలా చేయడం పిల్లల బాధ్యత అని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## బాబి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం

**ఆత్మకూర్( ఎం), రాజముద్ర న్యూస్ :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూర్ (ఎం) మండల కేంద్రంలో ప్రభుత్వ విప్ ఆలేరు శాసన సభ్యులు బీర్ల అయిలయ్య స్ఫూర్తితో,ఆత్మకూర్ గ్రామ కాంగ్రెస్ పెద్దల చేయుతతో అందరూ బాగుండాలి అందులో మేముండాలి"అనే ఆలోచన నుండి నూతనంగా స్థాపించబడిన"బాబీ ఫౌండేషన్ సంస్థ" ఈ రోజు భాభి ఫౌండేషన్ సంస్థ అధ్వర్యంలో ఇందిరా నగర్ కాలనీలో వేముల ముత్తయ్య తల్లి వేముల సాలమ్మ స్వర్గస్థులైనందున భాభి ఫౌండేషన్ సంస్థ చైర్మన్ కూరెళ్ల అనిత అనిల్,12వ వార్డు మెంబర్ ఈ సందరరేగా కూరెళ్ళ అనిల్ వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలుపుతు 5000/-రూ.లు ఆర్థిక సహాయం అందజేశారు. సందరరేగా అనిల్ మాట్లాడుతూ,12 వార్డు సభ్యులకు ఏ కష్టం వచ్చిన భాభి ఫౌండేషన్ సంస్థ తర్పున మేము అండగా ఉంటామని భరోసానిచ్చారు.ఈ కార్యక్రము లో బాబీ ఫౌండేషన్ కో ఆర్డినేటర్ ఉగ్గే నరేష్,కాంగ్రెస్ పార్టీ పెద్దలు కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు యాస లక్ష్మారెడ్డి,మాజీ సర్పంచ్ జన్నాయి కోడె నగేష్,కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షులు పోతగాని మల్లేశం,మత్స్యశాఖ అధ్యక్షులు ఎద్దు వెంకటేశ్వర్లు,బీసీ సెల్ అధ్యక్షులు ఎలగందుల శ్రీనివాస్,మాజీ వార్డ్ మెంబర్ వేముల లావణ్య నరసింగరావు,గ్రామ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు గుండెగాని కిరణ్,గట్టు శ్రీను,బద్దుల రాములు, నాగేయ్య, డబ్బేటి రాము,వేముల వెంకటేష్,గట్టు నరసింహ,ఎండి మజీద్,గట్టు శేఖర్, బద్దుల వెంకటేష్, మల్లయ్య, ఎల్లయ్య, శంకరయ్య,కొంగరి విద్యాసాగర్, మామిడి అనిల్, వేముల సురేష్, సూరారం శ్రీకాంత్, బొడ్డు ప్రభాకర్, బద్దుల లక్ష్మణ్, వేముల నవీన్, అర్జున్, అజయ్, దుర్గాప్రసాద్, మనోజ్ పాల్గొన్నారు.

## దుకాణాలకు ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరి

### ఆహార భద్రత అధికారి బ్రహ్మాజీ

**భీమదేవరపల్లి, జనవరి 02, రాజముద్ర :** వ్యాపారం చేసుకునే దుకాణ నిర్వహకులు, హొటల్లు తప్పనిసరిగా ట్రైడ్ లైసెన్స్ తీసుకోవాలని జిల్లా ఆహార భద్రత అధికారి బ్రహ్మాజీ తెలిపారు. భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ లోని పలు దుకాణాలను, హొటల్లను ఆహార భద్రత సిబ్బంది శుక్రవారం నాడు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ట్రేడ్ లైసెన్స్ లేకుండా హొటల్లను నిర్వహిస్తున్న యజమానులకు నోటీసులు జారీ చేశారు. నాణ్యమైన ఆహార పదార్థాలను మాత్రమే వాడాలని, నిల్వ ఉంచిన ఆహారాన్ని వాడకూడదని పలు సూచనలు ఇచ్చారు. దుకాణాల్లో కాలం చెల్లిన వస్తువులు ఉండకూడదని వ్యాపార యజమానులకు తెలియజేశారు.ట్రేడ్ లైసెన్స్ లేకుండా దుకాణాలను నిర్వహిస్తే వారిపైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



## విద్యార్థుల విద్యా సామర్థ్యాల పరిశీలన

### విద్యార్థులకు నోట్‌బుక్స్ అందించిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

**రామారెడ్డి జనవరి 2 రాజముద్ర న్యూస్ :** రామారెడ్డి మండలం గిద్ద గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శుక్రవారం జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ సందర్శించారు. విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. తరగతి గదిలో విద్యార్థులతో బోర్డుపై గణితశాస్త్ర లెక్కలు వ్రాయించి, వారి విద్యా స్థాయిని స్వయంగా పరిశీలించారు. ఈ సందరరేగా విద్యార్థిని నీ అభినందించారు. విద్యార్థులు చదువుపై మరింత శ్రద్ధ చూపాలని, ఉపాధ్యాయులు నాణ్యమైన బోధన అందించాలని సూచించారు. విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరిశీలించి, తరగతి గదుల్లో విద్యార్థులతో పరస్పర చర్చ జరిపి, బోధనా ప్రక్రియను గమనించారు. బోర్డుపై ప్రశ్నలు వ్రాయించి విద్యార్థులతో సమాధానాలు చెప్పిస్తూ వారి అవగాహన స్థాయిని అంచనా వేశారు. విద్యార్థుల్లో ప్రాథమిక నైపుణ్యాలు మెరుగుపడేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా పని చేయాలని కలెక్టర్ సూచించారు. పదవ తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా లక్ష్యంగా పెట్టుకుని చదవాలని జిల్లా కలెక్టర్ అన్నారు. ఇందుకు ఉపాధ్యాయులు విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి, వారి లోపాలను గుర్తించి తగిన మార్గనిర్దేశం చేయాలని సూచించారు. ప్రతి విద్యార్థి ప్రతిభను వెలికి తీసే విధంగా బోధన సాగించాలని, పరీక్షలకు పూర్తి స్థాయిలో సిద్ధం చేయాలని ఆయన పేర్కొన్నారు.అలాగే స్కూల్ ఆవరణలో పిచ్చి మొక్కలు, చెత్తా చెదారం లేకుండా పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. కలెక్టర్ వెంట ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ రవితేజ, ఆర్డీవో వీణ, డిఇఓ రాజు, తహసిల్దార్ ఉమలత, ఎంఈఓ ఆనందరావు ఉన్నారు.

## జనహృదయనేతకు జన్మదిన శుభాకాంక్షల వెల్లువ

- మాజీ కోఆప్షన్ సభ్యులు చిలుముల జగదీశ్వర్ రెడ్డి, సీనియర్ నాయకులు మోదుగు శేఖర్ రెడ్డిలకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన మేడ్చల్ జిల్లా ఇన్చార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి
- కేక్ కట్ చేయించి శాలువాలతో సన్మానించిన పలువురు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు



**మేడిపల్లి, రాజముద్ర న్యూస్:** ప్రజల మనిషి, ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్న మాజీ కోఆప్షన్ సభ్యులు తిరుమల జగదీశ్వర్ రెడ్డి మోదుగు శేఖర్ రెడ్డిలు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో జీవించాలని మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం తమ జన్మదినాన్ని పురస్కరించుకొని మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ ను, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డిలను కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందరరేగా వారు శాలువాలతో సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అదేవిధంగా సి పి ఆర్ ఐ రోడ్డులోని కార్యాలయంలో పలువురు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కేక్ కట్ చేయించి శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందరరేగా వారు మాట్లాడుతూ ప్రజా బంధువు, ప్రజలకు ఎనలేని సేవలు చేసి ప్రజల గుండెల్లో సుస్థిరమైన స్థానం సంపాదించుకున్నారని కీర్తించారు. రాజకీయాలకతీతంగా ప్రతి ఒక్కరిని కలుపుకొని పోతూ డివిజన్ అభివృద్ధిలో కీలకపాత్ర పోషించాలని తెలిపారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో కాంగ్రెస్ పార్టీ యూత్ ప్రెసిడెంట్ చిలుముల అజయ్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ఉప సర్పంచ్ బండారి రవీందర్, కెవి గౌడ్, కీసరగుట్ట ఆలయ డైరెక్టర్ ప్రభు గౌడ్, సుధాకర్, శ్రీధర్ రెడ్డి, యూత్ నాయకులు బత్తి సుమిత్ పాల్ రెడ్డి తదితరులు ఉన్నారు.






## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల తీరును పరిశీలించిన కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

**రామారెడ్డి, జనవరి 2 రాజముద్ర న్యూస్ :** శుక్రవారం రామారెడ్డి మండలం గిద్ద గ్రామంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ఆకస్మికంగా పర్యటించి, ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద లబ్ధిదారుడు నిర్మించుకుంటున్న ఇంటిని పరిశీలించారు. ఇంటి నిర్మాణ పనుల పురోగతిని గమనించిన కలెక్టర్, లబ్ధిదారుడితో మాట్లాడి పనుల వివరాలను తెలుసుకున్నారు. నిర్మాణాన్ని వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ఇప్పటివరకు ఇంటి నిర్మాణానికి అయిన ఖర్చు, తీసుకున్న రుణ వివరాలు, దశల వారీగా ప్రభుత్వం మంజూరు చేస్తున్న నిధుల కేటాయింపు పరిస్థితి, గతంలో నివసించిన ప్రాంతం, ప్రస్తుతం చేస్తున్న పని తదితర అంశాలపై లబ్ధిదారుడిని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుని, నాణ్యతతో ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. అనంతరం గిద్ద గ్రామంలో డ్రైనేజీ కాలువలు, రోడ్లకు ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కల తొలగింపు పనులను జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పరిశీలించారు. గ్రామంలో పరిశుభ్రత, పారిశుధ్య పరిస్థితులను మెరుగుపర్చేందుకు చేపడుతున్న చర్యలను ఆయన గమనించి, సంబంధిత అధికారులకు అవసరమైన



సూచనలు చేశారు. డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా పనిచేయాలంటే పిచ్చి మొక్కలు, చెత్తను పూర్తిగా తొలగించాలని, గ్రామంలో పరిశుభ్రమైన వాతావరణం ఉండేలా నిరంతరం శుభ్రత కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. రోడ్లకు ఇరువైపులా మొక్కల తొలగింపుతో పాటు నీరు నిల్వ కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కలెక్టర్ వెంట ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ రవితేజ, ఆర్డిఓ వీణ, తహసిల్దార్ ఉమలత, సంబంధిత అధికారులు తదితరులు ఉన్నారు.

## క్రీడలతోనే యువతకు ఉజ్వల భవిష్యత్తు

### పేరూరు ఎస్సై గుర్రం కృష్ణ ప్రసాద్

**వాజేడు, రాజముద్ర న్యూస్ :** మండల కేంద్రంలో చంద్రుపట్ల గ్రామంలో నూతన సంవత్సర, క్రిస్మస్, సంక్రాంతి సందర్భంగా శుక్రవారం అంతర్రాష్ట్ర క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పేరూరు ఎస్సై గుర్రం కృష్ణ ప్రసాద్ పాల్గొని రిబ్బన్ కట్ చేసి కొబ్బరికాయ కొట్టి క్రికెట్ క్రీడను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ..యువత చెడు వ్యసనాలకు బానిసలై ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని, క్రీడలు మానసిక ఉల్లాసాన్ని, దేహ దారుఢ్యాన్ని పెంపొందిస్తుందని,క్రీడల్లో నైపుణ్యత కలిగి, క్రీడల పట్ల ఉల్లాసంతో ఉంటారని, క్రీడల్లో గెలుపు ఓటమి సాధ్యమని, ఓటమికి పునాది బాట గెలుపు అన్నారు. ఈ కార్యక్రమంలో



టేకులగూడెం సర్పంచ్ బాలకృష్ణ,మురారి, సత్యనారాయణ, సంతోష్, నరేంద్ర, సమ్మయ్య, నాగభూషణం, గణపతి, గంగరాజు, ప్రభాకర్, శ్రీకాంత్, సమ్మయ్య పాల్గొన్నారు.

## ఆరూరు గ్రామపంచాయతీకి మూడో వార్డు మెంబర్ కీసర బోయిన మత్స్యగిరి విధి దీపాలు అందజేత

**వలిగొండ. రాజముద్ర న్యూస్ :** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని అరూరు గ్రామపంచాయతీకి మూడో వార్డు మెంబర్ కసరబోయిన మత్యగిరి తను సొంత నిధులతో వీధి దీపాలు అందించడం జరిగింది. ఈ సందరరేగా మాట్లాడుతూ గ్రామం అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తానని అన్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డిసిసి ఉపాధ్యక్షులు వాకిటి అనంతరెడ్డి ,అరూర్ గ్రామ సర్పంచ్ సుక్క ముత్యాలు,గ్రామ శాఖ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బుర్ర నరసింహ యాదవ్,యాదవ సంఘం అధ్యక్షులు కసరబోయిన లింగయ్య యాదవ్,మాజీ సింగల్ విండో డైరెక్టర్ ఆవుల స్వామి ,మత్స్యగిరి గుట్ట డైరెక్టర్ కోడితాల కరాకర్, రేక మత్స్యగిరి,వేముల అనిల్ కుమార్, కేదరి నరేష్-మనీషా, దామర అంజయ్య ,జక్కల మత్స్యగిరి,



కసరబోయిన వెంకటేశం ,నరాముల మహేష్, ముక్కాల గణేష్, కొప్పుల మధు,బుర్ర శివ గ్రామ సిబ్బంది మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు ,కార్యకర్తలు పాల్గొనడం జరిగింది



నూతన సంవత్సరం సందర్భంగా మాజీ మంత్రి, మేడ్చల్ శాసనసభ్యులు చామకూర మల్లారెడ్డి ని వారి నివాసంలో పీర్జాదిగూడ మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో బోయిన పల్లి క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసిన మాజీ కార్పొరేటర్లు దొంతిరి హరిశంకర్ రెడ్డి, మహేష్ , మధుసూదన్ రెడ్డి, పట్టణ బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఏడవల్లి రఘువర్ధన్ రెడ్డి, యూత్ అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి , కిరణ్ నాయక్, శంకర్ రావు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు,పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.



## యాసంగి సీజన్‌కు సరిపడా యూరియా నిల్వలు

### మండల వ్యవసాయ అధికారి

**ఆళ్లపల్లి, జనవరి 2 (రాజముద్ర న్యూస్):** ఆళ్లపల్లి మండలంలో యాసంగి సాగుకు అవసరమైన యూరియా ఎరువులు సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని ఎరువుల దుకాణాల్లో స్టాక్‌ను ఆయన తనిఖీ చేశారు. మండల వ్యాప్తంగా అన్ని ఎరువుల దుకాణాల్లో కలిపి 1320 బస్తాల యూరియా నిల్వలు ఉన్నాయని పేర్కొన్నారు. ప్రస్తుత యాసంగి సీజన్‌కు ఇది పూర్తిగా సరిపోతుందని, రైతులు యూరియా కొరతపై ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. యాసంగి పంటలకు సంబంధించి రైతులు విత్తనాల బిల్లుల ఆధారంగా యూరియాను కొనుగోలు చేసుకోవచ్చని సూచించారు. అందుబాటులో ఉన్న ఎరువులను సకాలంలో సద్వినియోగం చేసుకోవాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. ఈ సందరరేగా రైతులకు ఫర్టిలైజర్ మొబైల్ యాప్ వినియోగంపై అవగాహన కల్పించి, యూరియా కొనుగోలు ప్రక్రియను యాప్ ద్వారా ఎలా సులభంగా నిర్వహించుకోవచ్చో వివరించారు.



## టీఎస్ యుటిఎఫ్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

**ఆళ్లపల్లి, జనవరి 2: (రాజముద్ర న్యూస్) :** తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్ యుటిఎఫ్) సంఘం నూతన సంవత్సరానికి సంబంధించి రూపొందించిన డైరీ మరియు క్యాలెండర్‌ను మండల విద్యాశాఖ అధికారి కే. శాంతారావు, మర్కోడు కాంప్లెక్స్ హెడ్మాస్టర్ బి. బాబులాల్‌లు ఆవిష్కరించారు. స్థానిక జడ్పీహెచ్ఎస్ మర్కోడు పాఠశాలలో సంఘం మండల ప్రధాన కార్యదర్శి ఏ. రామకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఈ డైరీ, క్యాలెండర్‌లను విడుదల చేశారు. ఈ సందరరేగా ఎంఈవో కే. శాంతారావు మాట్లాడుతూ నూతన సంవత్సరం అందరికీ శుభప్రదంగా ఉండాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయులు విద్యార్థుల విద్యా ప్రమాణాలు మెరుగుపరిచే దిశగా కృషి చేసి ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. అలాగే, పదో తరగతి విద్యార్థులు ప్రణాళికాబద్ధమైన కార్యాచరణ రూపొందించుకొని మార్చిలో జరగనున్న పబ్లిక్ పరీక్షలకు సమర్థంగా సిద్ధమవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎల్ఎఫ్ఎల్ హెడ్మాస్టర్లు ఎల్. రాందాస్, ఎం. శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి ఇస్లావత్ హాతిరామ్, మండల నాయకులు రమేష్, వేణు, శారదామని, ప్రేమ్ కుమార్, హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.



## అంగన్వాడి చిన్నారులతో నూతన సంవత్సర వేడుకలు

### చిన్నారులతో కలసి కేక్ కట్ చేసిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

**రామారెడ్డి, జనవరి 2 రాజముద్ర న్యూస్ :** నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ శుక్రవారం రామారెడ్డి మండలం గిద్ద గ్రామంలోని అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించి చిన్నారులతో కలిసి నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. ఈ సందరరేగా చిన్నారులతో కలిసి కేక్ కట్ చేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అంగన్వాడి కేంద్రంలోని రిజిస్టర్లు, స్టోర్ రూమ్‌ను పరిశీలించి, అంగన్వాడి కేంద్రంలో అవసరమైన మౌలిక సదుపాయాలను మెరుగుపర్చాలని, మరమ్మత్తులు చేయించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమం లో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ రవితేజ, సంబంధిత సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

**రామారెడ్డి, రాజముద్ర న్యూస్ :** మండలంలోని కన్నాపూర్ గ్రామ పంచాయతీ వర్కర్ కరికే నర్సింలు వాళ్ళ అమ్మ మరణించడంతో వారి కుటుంబానికి ఆర్థికకంగా గ్రామ పంచాయతీ పాలకవర్గం గొల్ల మహేష్ సర్పంచ్. పంచాయతీ కార్యదర్శి లావణ్య, యాత్వంత్ రావు ఉపసర్పంచ్. శగా నవీన్. హరీష్. ప్రశాంత్. లావణ్య. రవళి. విజయ.గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు బిక్షపతి, తమ వంతు సహాయం గా 20,500/- ఇరువై వేల ఐదు వందల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు.



## ఆర్థిక సాయం అందజేసిన సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు వెంకట్ రెడ్డి

**మోటకొండూరు. రాజముద్ర న్యూస్:** ఇటీవల లారీ ప్రమాదంలో కాలు విరిగి దిల్సుఖ్ నగర్ లోని సాయి సంజీవిని హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న కొండాపురం గ్రామానికి చెందిన మర్రి బిక్షపతిని శుక్రవారం మోట కొండూరు కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు కొండాపురం సర్పంచ్ కొప్పుల వెంకట్ రెడ్డి పరామర్శించి అనంతరం వారి కుటుంబ సభ్యులకు 10000 రూపాయలు ఆర్థిక సాయం అందజేసి త్వరలో కోలుకునే విధంగా చికిత్స అందించాలని వైద్య సిబ్బందిని కోరారు.



## అంగన్వాడీ పిల్లలకు ఏకరూప దుస్తులు పంపిణీ

**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** ప్రైవేట్ నర్సరీ పాఠశాలలకు ధీటుగా అంగన్‌వాడీ కేంద్రాలను అభివృద్ధి చేసి ప్రీ-ప్రైమరీ విద్యను అందించేందుకు సీఎం రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని కూసుమంచి సర్పంచ్ కొండా కృష్ణవేణి,ఉప సర్పంచ్ చెన్ను వెంకటరమణ అన్నారు.మండల కేంద్రంలోని అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం 3 నుండి 6 సంవత్సరాల మధ్య వయస్సు గల పిల్లలకు తెలంగాణ ప్రభుత్వం అందించిన ఏకరూప దుస్తులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లల మధ్య సమానత్వాన్ని తీసుకురావడం కోసమే ఏక రూప దుస్తులను పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు.అనంతరం నూతన సంవత్సరం కేక్ ను కట్ చేసి పిల్లలకి మిఠాయిలు పంచి పెట్టారు. గత సంవత్సర కాలంగా అంగన్వాడీ,ప్రాథమిక పాఠశాల పిల్లలకు సుమారుగా ముప్పై వేల రూపాయలు సొంత నిధులతో మినరల్ వాటర్ ను సరఫరా చేస్తున్న ఉప సర్పంచ్ వెంకటరమణను అభినందించారు.తుదపరిసర్పంచ్,ఉప సర్పంచ్ లని శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో సిడిపిఓ కవిత,సూపర్ వైజర్ సువర్చల,అంగన్వాడీ టీచర్లు బుర్ర పద్మ, సంద్ర పుష్పలత,ఆళ్లగడప వరలక్ష్మి,వార్డు సభ్యులు అర్వపల్లి ఉపేందర్ గౌడ్,ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు అంగిరేకుల శ్రీరాములు, విజయలక్ష్మి,తల్లితండ్రులు,తదితరులు పాల్గొన్నారు.



## ఎస్ఎన్ 9 న్యూస్ ఛానల్ క్యాలెండర్ ఆవిష్కరణ

**సూర్యాపేట,రాజముద్ర న్యూస్ :** సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఎస్ ఎన్ 9 న్యూస్ ఛానల్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ (ఐపీఎస్) ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ నరసింహ మాట్లాడుతూ, ప్రజలకు సత్యసంధమైన సమాచారాన్ని అందించడంలో మీడియా కీలక పాత్ర పోషిస్తోందని అన్నారు ఎస్ ఎన్ 9 న్యూస్ ఛానల్ ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చి, సమాజ హితానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఎన్ 9 న్యూస్ ఛానల్ సీఈవో చాంద్ పాషాతో పాటు పలువురు మీడియా మిత్రులు పాల్గొన్నారు. క్యాలెండర్ రూపకల్పన ఆకర్షణీయంగా ఉందని, భవిష్యత్తులోనూ ఎస్ ఎన్ 9 న్యూస్ ఛానల్ మరింత విజయవంతంగా ముందుకు సాగాలని పలువురు అభినందనలు తెలిపారు.

## కొల్లూర్ పోలీస్ స్టేషన్ ఎస్ఐని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న ఏసిబి అధికారులు

### వివరాలను వెల్లడించిన మెదక్ ఏసిబి డీఎస్పీ సుధాకర్

**పటాన్ చెరువు, రాజముద్ర న్యూస్:** కొల్లూరు పోలీస్ స్టేషన్ ఎస్ఐ ఫిర్యాదుదారుడు నుంచి లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖకు రెడ్ హ్యాండెడ్ గా పట్టుబడ్డాడు. మెదక్ ఏసీబీ డీఎస్పీ సుధాకర్ వివరాలను వెల్లడించారు. సంగారెడ్డి జిల్లా, సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని కొల్లూరు పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న ఎస్ఐ ఎం.రమేష్‌ను ఏసీబీ అధికారులు శుక్రవారం రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నామని తెలిపారు. ఫిర్యాదుదారుడి నుంచి రూ.20 వేలు లంచం తీసుకుంటూ



ఆయన ఏసీబీ వలలో చిక్కుకున్నాడని అన్నారు. కొల్లూరు పోలీస్ స్టేషన్ పరిధిలో అక్టోబర్ 17, 2025న పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తున్న లారీని కొల్లూరు పోలీసులు పట్టుకుని కేస్ నమోదు చేశారు. కేసులో ఫిర్యాదుదారుడి పేరు తొలగించేందుకు ఎస్ఐ లంచం డిమాండ్ చేసినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. మొదట రూ.30 వేల లంచం కోరిన ఎస్ఐ, ఇందులో భాగంగా గత నెల 17న రూ.5 వేలు ఇప్పటికే తీసుకున్నట్లు విచారణలో వెల్లడైందని తెలిపారు. తాజాగా మిగిలిన రూ.20 వేలు తీసుకుంటున్న సమయంలో ఏసీబీ అధికారులు దాడి చేసి నగదును స్వాధీనం చేసుకున్నారు. విధి నిర్వహణలో అవినీతికి పాల్పడి అక్రమ లాభం పొందినట్లు నిర్ధారణ కావడంతో నిందిత ఎస్ఐని అరెస్టు చేసి హైదరాబాద్‌లోని అదనపు ప్రత్యేక న్యాయస్థానం ముందు హాజరుపర్చనున్నారనీ తెలిపారు. కేసు దర్యాప్తు కొనసాగుతోందని తెలిపారు. భద్రతా కారణాల దృష్ట్యా ఫిర్యాదుదారుడి వివరాలను గోప్యంగా ఉంచుతున్నామని చెప్పారు. అదేవిధంగా లంచం డిమాండ్ చేస్తే 1064కు ఫోన్ చేయాలని, ఏదైనా ప్రభుత్వ ఉద్యోగి లంచం అడిగినట్లయితే ప్రజలు టోల్‌ఫ్రీ నెంబర్ 1064ను సంప్రదించాలని సూచించారు.



## పెద్దవెంకటాపురం గ్రామాభివృద్ధికి తొలి అడుగు

### వీధిలైట్ల ఏర్పాటు -సర్పంచ్ వజ్జ ఉమాకు ప్రశంసలు

**ఆళ్లపల్లి జనవరి 2(రాజముద్ర న్యూస్) :** ఆళ్లపల్లి మండలం,పెద్ద వెంకటాపురం గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలనే లక్ష్యంతో సర్పంచ్ వజ్జ ఉమా గారు తొలి అడుగు వేశారు. గ్రామంలోని చీకటి వీధులకు వెలుగు నింపుతూ వీధిలైట్ల ఏర్పాటు చేయడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సీపీఐ పార్టీ కార్యదర్శి ఎస్కే. సాబీర్ పాషా స్ఫూర్తితో, జిల్లా సీపీఐ కార్యవర్గ సభ్యులు, ఆళ్లపల్లి మండల మాజీ వైస్ ఎంపీపీ రేస్ ఎల్లయ్య ఆదేశానుసారం ఈ కార్యక్రమాన్ని తాను ప్రారంభించానని సర్పంచ్ వజ్జ ఉమా తెలిపారు. ఇది తన పాలనలో చేపట్టిన తొలి అభివృద్ధి కార్యక్రమమని పేర్కొన్నారు. వెంకటాపురం గ్రామపంచాయతీ పరిధిలోని సింగారం గ్రామం మరియు బాసవారి గుంపులో వీధిలైట్లు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంతో గ్రామంలోని రహదారులు, వీధులు వెలుగులతో కళకళలాడుతున్నాయి. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కొమరం రాజేష్, సీపీఐ మండల నాయకులు వజ్జ చిరంజీవి, తాటి నాగేష్, తాటి ఎల్లయ్య, వజ్జ రమేష్, కల్తీ సత్యనారాయణ, పడిగ శ్రీలత, కొమరం కృష్ణ, కండె రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు. గ్రామాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని సర్పంచ్ వజ్జ ఉమా ఈ సందర్భంగా తెలిపారు.

# మన పొరుగు దేశం.. కయ్యాలమారి

### కేంద్ర మంత్రి వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ :** ఉగ్రవాదం నుంచి తన ప్రజలను రక్షించుకొనే హక్కు భారత్‌కు ఉందని విదేశాంగ శాఖ మంత్రి ఎస్.జైశంకర్ అన్నారు. పాకిస్థాన్ ఉగ్రవాదాన్ని ఎగదోసే కయ్యాలమారి మన పొరుగు దేశమని పేర్కొంటూ ఈ వ్యాఖ్య చేశారు. శుక్రవారం ఐఐటీ మద్రాస్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి విద్యార్థులతో మాట్లాడారు. అలాగే ఆపరేషన్ సిందూర్ గురించి ప్రస్తావిస్తూ.. "మనం ఏం చేయాలో.. ఏం చేయకూడదో ఇతరులు నిర్ణయించలేరు" అని తేల్చి చెప్పారు. "మీ పొరుగువారు చెడ్డవారు ఉండొచ్చు. దురదృష్టవశాత్తూ మన దేశానికీ ఉన్నారు. వారు ఉద్దేశపూర్వకంగా ఉగ్రవాదాన్ని ఎగదోస్తుంటే.. ఆ ఉగ్రవాదం నుంచి ప్రజలను రక్షించుకునే హక్కు మనకుంది. మనం ఆ హక్కును వినియోగించుకుంటాం. దానిని ఎలా వాడతామనేది మన నిర్ణయం పైనే



ఆధారపడి ఉంటుంది. అంతేకానీ ఆ అంశంలో ఇతరులు ఎవరూ తల దూర్చలేరు. మనల్ని మనం రక్షించుకోవడానికి మనం చేయాల్సిందంతా చేస్తాం" అని జైశంకర్ వెల్లడించారు.

## ఢిల్లీని కమ్మేసిన పొగమంచు..

### విమాన సర్వీసులకు అంతరాయం

**న్యూఢిల్లీ :** దేశ రాజధాని ఢిల్లీని పొగమంచు కమ్మేసింది. దీనివల్ల విజిబిలిటీ తగ్గిపోవడంతో విమాన సర్వీసులకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పలు విమానయాన సంస్థలు విమానాల రద్దును ప్రకటించాయి. మరికొన్ని ఆలస్యంగా నడవనున్నట్లు తెలిపాయి. పొగమంచు నేపథ్యంలో వాతావరణ శాఖ ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. శుక్రవారం తెల్లవారుజామున ఢిల్లీలో గాలి నాణ్యత సూచీ 369గా నమోదైనట్లు కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి తెలిపింది. పొగమంచు విపరీతంగా కురుస్తున్నందున విజిబిలిటీ తగ్గిపోవడంతో విమాన కార్యకలాపాలు ప్రభావితమయ్యాయని ఇండిగో తెలిపింది. ఈ క్రమంలో కొన్ని విమానాలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. విమానాల రద్దుతో ప్రభావితమైన ప్రయాణికులు ఆన్‌లైన్‌లో రీబుక్ చేసుకోవచ్చని లేదా డబ్బు వాపసు పొందవచ్చని తెలిపింది. పొగమంచు వల్ల వారణాసి, ఉదయ్‌పుర్, జమ్మూ, విశాఖపట్నం, జైసల్మేర్‌లకు విమాన సర్వీసులు నెమ్మదిగా సాగుతున్నట్లు తెలిపింది. ఈక్రమంలో హైదరాబాద్, గువాహటి విమాన షెడ్యూల్‌లు కూడా



ప్రభావితం అయ్యాయని వెల్లడించింది. ఇక, ఎయిరిండియా కూడా ఇలాంటి ప్రకటనే చేసింది. ఢిల్లీతో పాటు ఉత్తర భారతంలోని కొన్ని ప్రాంతాల్లో దట్టమైన పొగ మంచు, తక్కువ విజిబిలిటీ వల్ల పలు విమానాలు రద్దయ్యాయని, మరికొన్ని ఆలస్యమవుతాయని తెలిపింది. మరోవైపు.. హైదరాబాద్‌ను కూడా పొగమంచు కమ్మేసింది. దీంతో ఇక్కడినుంచి పలు ప్రాంతాలకు వెళ్లాల్సిన విమానాలు రద్దయ్యాయి.

## తైవాన్ సమీపంలో యుద్ధ విన్యాసాలు ఆపండి

### చైనాను కోరిన అమెరికా

**యూఎస్ :** తైవాన్ విషయంలో చైనా అనుసరిస్తున్న విధానాలపై అమెరికా ఆందోళన వ్యక్తం చేసింది. బీజింగ్ సంయమనం పాటించాలని విజ్ఞప్తి చేసింది. ఇటీవల తైవాన్ జలసంధి చుట్టూ చైనా భారీగా యుద్ధ విన్యాసాలు చేయడం తీవ్ర ఆందోళన కలిగించిన సంగతి తెలిసిందే. ఈ పరిణామాల పైనే తాజాగా అమెరికా విదేశాంగశాఖ స్పందించింది. 'తైవాన్ చుట్టూ చైనా సైనిక విన్యాసాలు, బెదిరింపులకు పాల్పడటం ఈ ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్తతలు పెంచుతాయి. బీజింగ్ సంయమనం పాటించాలని, తైవాన్‌పై సైనిక ఒత్తిడిని ఆపాలని కోరుతున్నాం. దౌత్యమార్గాలతో ఈ సమస్యను పరిష్కరించుకుంటారని ఆశిస్తున్నాం' అని విదేశాంగశాఖ ప్రతినిధి టామీ పిగోట్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తైవాన్ జలసంధి చుట్టూ శాంతి, స్థిరత్వానికి యూఎస్ మద్దతిస్తోందన్నారు. ఏకపక్షంగా బలవంతపు చర్యలను, బెదిరింపులను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ఈ వారం ప్రారంభంలో తైవాన్



చుట్టూ చైనా భారీగా నౌక, వైమానిక దళాల విన్యాసాలు చేసింది. రెండు రోజుల్లో బీజింగ్ తమ ద్వీపదేశం చుట్టూ 130 యుద్ధ విమానాలు, 14 యుద్ధ నౌకలను మోహరించిందని తైపీ రక్షణశాఖ పేర్కొంది. వీటిని తీవ్రంగా ఖండించింది. ఇక, కొత్త సంవత్సరం వేళ జాతినుద్దేశించి చేసిన ప్రసంగంలో తైవాన్‌ను తిరిగి తీసుకొనే ప్రక్రియ ఆగేది కాదని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ చేసిన వ్యాఖ్యలు ఉద్రిక్తతలను మరింత పెంచాయి. అయితే, చైనా విస్తరణవాదం నుంచి తమ దేశాన్ని రక్షించుకుంటామని తైవాన్ అధ్యక్షుడు లై చింగ్ తె తెలిపారు.

## మండల ప్రధానోపాధ్యాయుల ముఖ్య సమావేశం

**వాజేడు, రాజముద్ర న్యూస్:** మండల విద్యా వనరుల కేంద్రం నందు వాజేడు మండల ప్రధాన ఉపాధ్యాయులు శుక్రవారం సమావేశం నిర్వహించారు. మండల విద్యాశాఖ అధికారి టి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ..డీఎస్సీ, ఎఫ్ఆర్ఎస్ విద్యార్థులు ఉపాధ్యాయుల హాజరు యాప్ నందు నమోదు చేయాలని, ఏండిఏం రోజువారి విద్యార్థుల సంఖ్యను తెలంగాణ స్కూల్ ఎడ్యుకేషన్ యాప్ నందు నమోదు చేయాలని,పదవ తరగతి విద్యార్థులకు యాక్షన్ ప్లాన్ తయారుచేసి ఏబిసిడి గ్రూపులుగా విభజించి స్పెషల్ క్లాసులు నిర్వహించాలని, మండలంలోని ఉపాధ్యాయులు అందరూ పాఠశాలలకు సమయపాలన పాటించి హాజరు కావాలని,రాష్ట్రం నుంచి నిర్వహించే అన్ని రకాల ఆన్లైన్ ఆక్టివిటీస్ లో మండలాన్ని ముందంజలో నిలపాలని,హైస్కూల్ విద్యార్థులు, ఏ ఎక్స్ ల్ లాబ్స్, ఖాన్ అకాడమీ, ఫిజిక్స్ వాళ్ళను ఎక్కువ విద్యార్థులు వీక్షించేలా చర్యలు తీసుకోవాలని,చదువు మానేసిన పాఠశాల విద్యార్థుల సర్వే వివరాలను కొత్తగా ప్రబంధ్ పోర్టల్ లో నమోదు చెయ్యాలని,విద్యార్థులను గ్రూపులుగా చేసి వారి యెక్క సామర్థ్యలను పరీక్షించి, మెరుగుపరిచలని,10వ తరగతి



విద్యార్థులకు ప్రత్యేక కార్యాచరణ ద్వారా ఏబీసీ గ్రూపులుగా చేసి వారి యెక్క సామర్థ్యలను మెరుగుపరచాలని,మండలంలో ఉన్న అన్ని పాఠశాలలోని విద్యార్థుల సంఖ్య కంటే మిగిలిన్న బెంచీలను ఎంపీపీస్ వాజేడు నాగారం నుంచి ఎంపీపీఎస్ వాజేడు కూ 12 బెంచీలు గుమ్మడిదొడ్డికి పాఠశాలకు 7 బెంచీలు పంపిణి చేశారు.ఈ సమావేశంలొ ఆర్ పి జేయందర్, సునీత, రామన్న, వెంకన్న, తదితర పాఠాశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

## డిఫెన్సివ్ డ్రైవింగ్‌తో మరింత రోడ్డు భద్రత

- రోడ్డు ప్రమాదాల నివారణ, రోడ్డు భద్రత ప్రతిఒక్కరి బాధ్యత.
- సూర్యాపేట జిల్లా ఎస్పి కె.నరసింహ

**సూర్యాపేట, రాజముద్ర న్యూస్ :** ఏ ఒక్కరు కూడా రోడ్డు ప్రమాదాలకు గురై మృత్యువాత పడువద్దని, డిఫెన్సివ్ డ్రైవింగ్ చేస్తూ రోడ్డు ప్రమాదాలు నివారణ కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఉండాలి అని జిల్లా ఎస్పీ నరసింహా ఐపిఎస్ అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం, రోడ్డు రవాణా సంస్థ,రాష్ట్ర రోడ్ సేఫ్టీ పోలీస్ విభాగం ఆధ్వర్యంలో జనవరి నెలలో జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాలు నిర్వహించడం జరుగుతుందని దీనిలో భాగంగా ఈనెల 31 వరకు జిల్లా వ్యాప్తంగా రోడ్డు భద్రత మాసోత్సవాలు నిర్వహిస్తామని, రోడ్డు భద్రత పట్ల, ప్రమాదాల నివారణ ప్రజలందరికీ అవగాహన కల్పిస్తామని జాతీయ రోడ్డు భద్రత మాసొత్సవాల్లో ప్రజలు భాగస్వామ్యం కావాలని ఎస్పీ తెలిపారు. రోడ్డు ప్రమాదం వల్ల ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఏ ఒక్క కుటుంబం రోడ్డు ప్రమాదాల వల్ల వ్యక్తి ప్రాణాలు కోల్పోవద్దు అని అన్నారు. జాతీయ రోడ్డు



భద్రత మాసోత్సవాల నిర్వహణ కోసం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రణాళిక తయారు చేయడం జరిగిందని ప్రణాళిక మేరకు జిల్లా పోలీస్ సిబ్బంది గ్రామాలు, పట్టణాలు, కాలనీలు, విద్యాసంస్థలు, కమ్యూనిటీ విభాగాలు, షాపింగ్ మాల్స్, ఫ్యాక్టరీలు, ప్రమాద జంక్షన్ లు, జన సమూహ ప్రాంతాలలో రోడ్డు భద్రత పట్ల, డిఫెన్సివ్ డ్రైవింగ్, అరైవ్ అలైవ్ పట్ల అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని ప్రమాదాలు జరిగే విధానాన్ని ప్రజలకు వివరిస్తామని తెలియజేశారు

## నీరు కాదు విషాన్ని పంచారు..

### ఇండోర్‌లో మరణాలపై రాహుల్ ఆందోళన

**న్యూఢిల్లీ :** కలుషిత నీరు తాగి మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ నగరంలో పలువురు ప్రాణాలు కోల్పోవడం ఆందోళన రేకెత్తిస్తోంది. ఈ ఘటనపై తాజాగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్పందించారు. అక్కడి ప్రభుత్వం నీరు కాకుండా.. విషాన్ని పంపిణీ చేస్తోందని మండిపడ్డారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్టు పెట్టారు. రాష్ట్ర ప్రభుత్వం



ప్రజల ఆరోగ్యం పట్టించుకోకుండా కుంభకర్ణుడిలా నిద్రపోతోందని రాహుల్ విమర్శించారు. కలుషిత నీరు తాగడం వల్ల చాలా మంది ఇళ్లలో విషాదం నెలకొందని.. పేదలు నిస్సహాయ స్థితిలో ఉన్నారన్నారు. దీనికి తోడు అధికార భాజపా నేతలు నిర్లక్ష్యపు ప్రకటనలు చేయడాన్ని తప్పుబట్టారు. బాధిత కుటుంబాలకు ఓదార్పు ఇవ్వకుండా.. అహంకారంతో వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. 'మురికిగా, దుర్వాసన వస్తోన్న నీటి గురించి గతంలో ప్రజలు పదే పదే ఫిర్యాదు చేసినా ప్రభుత్వం ఎందుకు పట్టించుకోలేదు? తాగే నీటిలో మురుగునీరు ఎలా కలిసింది? వెంటనే నీటి సరఫరా ఎందుకు ఆపలేదు? బాధ్యులైన అధికారులపై ఎప్పుడు చర్యలు తీసుకుంటారు?' అని రాహుల్ ప్రశ్నించారు. పరిశుభ్రమైన నీరు పొందడం ప్రజల హక్కు అని అన్నారు. ఈ హక్కును కాలరాసిన భాజపా ప్రభుత్వమే దీనికి పూర్తి బాధ్యత వహించాలన్నారు. దుష్పరిపాలనకు మధ్యప్రదేశ్ కేంద్రంగా మారిందని విమర్శించారు. మొన్నటి వరకు దగ్గు మందు కారణంగా, ఆ తర్వాత ప్రభుత్వాస్పత్రుల్లో ఎలుకల వల్ల పిల్లలు ప్రాణాలు కోల్పోయారన్నారు. ఇప్పుడు కలుషిత నీరు కారణంగా మృతి చెందుతున్నారన్నారు. ఇలా ఎప్పుడు పేదలు మరణించినా.. మోదీజీ మాత్రం మౌనంగానే ఉంటారని విమర్శించారు. ఇక, ఓ మరుగుదొడ్డి వద్ద మంచినీటి పైపులైన్ లీకేజీ వల్లే ఈ మరణాలు చోటుచేసుకుంటున్నాయని నగర మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు తాజాగా తెలిపారు. ఈ కలుషిత నీరు తాగి ఇప్పటివరకు 10 మంది మృతి చెందారని ఇండోర్ మేయర్ పుష్యమిత్ర భార్గవ వెల్లడించారు.

## యూనస్ బంగ్లాదేశ్‌ను అంధకారంలోకి నెట్టేశారు : షేక్ హసీనా

**బంగ్లాదేశ్ :** బంగ్లాదేశ్‌లో అనిశ్చితి కొనసాగుతోంది. అక్కడి ఉద్రిక్త పరిస్థితులపై ఆ దేశ మాజీ ప్రధాని షేక్ హసీనా ఆందోళన వ్యక్తం చేశారు. మహమ్మద్ యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం దేశాన్ని అంధకారంలోకి నెట్టేసిందని ఆరోపించారు. నూతన సంవత్సరం నేపథ్యంలో బంగ్లాదేశ్ ప్రజలను ఉద్దేశిస్తూ ఆమె ఓ సందేశం విడుదల చేశారు. దీన్ని ఆమె పార్టీ అవామీ లీగ్ ఎక్స్‌లో పోస్టు పెట్టింది. దేశాన్ని నాశనం చేయడానికి కుట్రలు పన్నిన వారి ముఖాలు ఇప్పటికే బహిర్గతమయ్యాయన్నారు. అక్రమ దోపిడీ దారులు దేశ ప్రజలను



బందీలుగా చేసుకొన్నారన్నారు. యూనస్ నేతృత్వం లోని తాత్కాలిక ప్రభుత్వం అపరిమిత అవినీతి, వ్యక్తిగత ప్రయోజనాల కోసం దేశాన్ని అంధకారంలోకి నెట్టేసిందని ఆరోపించారు. విదేశీ పెట్టుబడిదారులు అభద్రతాభావం, కొనసాగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో దేశ ఆర్థికవ్యవస్థ కుప్పకూలిపోయిందని అభిప్రాయపడ్డారు. పరిస్థితులు మరింత దిగజారకుండా జాగ్రత్త పడాలని సూచించారు. కొత్త సంవత్సరాన్ని స్వాగతిస్తున్న నేపథ్యంలో దేశాన్ని రక్షించుకునేందుకు బంగ్లాదేశ్ ప్రజలంతా ఐక్యం కావాలని పిలుపునిచ్చారు. దేశం ఇప్పుడు భయం గుప్పిట్లో ఉందని.. ప్రస్తుతం ఏ దేశం కూడా బంగ్లాదేశ్‌ను, దేశ ప్రజలను గౌరవంగా చూడటం లేదన్నారు. గతంలో తమ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ప్రజలు కలిసిమెలిసి జీవించేవారన్నారు. ఇప్పుడు ఆ పరిస్థితులు ఎక్కడా కన్పించడం లేదని ఆందోళన వ్యక్తంచేశారు.



## మళ్లీ కనిపించిన కిమ్ కుమార్తె

**ఉత్తరకొరియా :** ఉత్తరకొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్ కుమార్తె కిమ్-జు-యే మళ్లీ బహిరంగంగా కనిపించింది. తల్లిదండ్రులతో కలిసి దేశ మాజీ నేతల స్మారక ప్రదేశం 'కుమ్‌సుసన్' స్మారకాన్ని ఆమె సందర్శించింది. గత మూడేళ్ల నుంచి తండ్రి కిమ్‌జోంగ్ ఉన్‌తో పాటు జు-యే పలు అధికారిక కార్యక్రమాల్లో పాల్గొంటోంది. కిమ్ తన కుమార్తెను అధికారిక పర్యటనలకు తీసుకువెళ్తుండడంతో.. భవిష్యత్తులో అధికారిక పగ్గాలు ఆమెకే అందించనున్నట్లు సంకేతాలను పంపుతున్నారని దక్షిణ కొరియా నిఘా వర్గాలు భావిస్తున్నాయి. ఈ విషయాన్ని కిమ్ త్వరలో ప్రకటించే అవకాశం కూడా ఉన్నట్లు తెలుస్తోంది. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని దేశ మాజీ నాయకులకు నివాళులు అర్పించిన ఈ కార్యక్రమానికి కిమ్‌తో పాటు అతని భార్య రి సోల్ జు, కుమార్తె కిమ్-జు-యే, ఇతర సీనియర్ అధికారులు హాజరయ్యారు. గతేడాది కిమ్ చైనాకు అధికారిక పర్యటనకు వెళ్లిన సమయంలోనూ కిమ్-జు-యే ఆయనతో ఉంది.

### వారసత్వ సంకేతాలు..

మొదటిసారిగా 2022లో కిమ్ తన కుమార్తె కిమ్-జు-యేను ప్రపంచానికి పరిచయం చేశారు. 2023లో మిలిటరీ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ప్యాంగ్యాంగ్‌లో మరోసారి కనిపించింది. నాటినుంచి పలు అధికారిక కార్యక్రమాలకు కూడా హాజరవుతోంది. ఇవన్నీ ఆమె కిమ్ వారసురాలన్న వార్తలకు బలం చేకూరుస్తున్నాయి. కాగా దక్షిణకొరియా నిఘా వర్గాల ప్రకారం కిమ్‌కు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. రెండో సంతానంగా పుట్టిన కుమార్తె కిమ్-జు-యే అధికారాన్ని చేపట్టే అవకాశం ఉందని స్థానిక అధికారిక వర్గాలు పేర్కొంటున్నాయి. కిమ్ కూడా వంశపారంపర్యంగానే అధికారానికి వచ్చారు. తండ్రి కిమ్ జోంగ్-2 2011లో మరణానంతరం ఈయన పగ్గాలు చేపట్టారు.

# మార్కెట్‌లోకి కొత్త కియా సెల్టోస్..

## ధర 10.99 లక్షల నుంచి ప్రారంభం




ప్రముఖ కార్ల తయారీ సంస్థ కియా తన రెండో జనరేషన్ సెల్టోస్‌ను దేశీయ మార్కెట్‌లో విడుదల చేసింది. గట్టి పోటీ ఉన్న మిడ్‌సైజ్ ఎస్‌యూవీ సెగ్మెంట్‌లో అత్యాధునిక హంగులతో 2026 మోడల్ సెల్టోస్‌ను తీసుకొచ్చింది. దీని ప్రారంభ ధరను రూ.10.99 లక్షలుగా (ఎక్స్‌షోరూమ్) నిర్ణయించింది. గరిష' ధరను రూ.19.99 లక్షలు (ఎక్స్ షోరూమ్)గా పేర్కొంది. జనవరి రెండో వారం తర్వాత నుంచి వీటి డెలివరీలు ప్రారంభమవుతాయని వెల్లడించింది. రూ.25వేల టోకెన్ అమౌంట్‌తో డిసెంబర్ 11 నుంచి బుకింగ్స్ ప్రారంభించిన సంగతి తెలిసిందే.






## భారీ లాభాల్లో సూచీలు..

**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి మిశ్రమ సంకేతాలున్నా.. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, రిలయన్స్ వంటి దిగ్గజ షేర్లలో కొనుగోళ్ల మద్దతు సూచీలకు దన్నుగా నిలిచాయి. ఎఫ్‌ఎంసీజీ మినహా మిగిలిన అన్ని రంగాల షేర్లలో కొనుగోళ్ల మద్దతు కనిపించింది. ఈ క్రమంలోనే సెన్సెక్స్ 500 పాయింట్లకు పైగా లాభపడగా.. నిఫ్టీ ఆల్‌టైమ్ గరిష'లను తాకింది. సెన్సెక్స్ ఉదయం 85,259.36 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 85,188.60) లాభాల్లో ప్రారంభమైంది. రోజంతా లాభాల్లోనే కొనసాగింది. ఇంట్రాడేలో 85,812.27 వద్ద గరిష'న్ని తాకిన సూచీ.. చివరికి 573.41 పాయింట్ల లాభంతో 85,762.01 వద్ద ముగిసింది. నిఫ్టీ ఇంట్రాడేలో 26,340.00 వద్ద గరిష'న్ని తాకి.. చివరికి 182 పాయింట్ల లాభంతో 26,328.55 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ మళ్లీ 90 మార్కు దాటి 90.20కి చేరింది. సెన్సెక్స్ 30 సూచీలో ఎన్టీపీసీ, ట్రెంట్, బజాజ్ ఫైనాన్స్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, మారుతీ సుజుకీ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. ఐటీసీ, కోటక్ మహీంద్రా బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్ భారతీ ఎయిర్‌టెల్, అల్ట్రాటెక్ సిమెంట్ షేర్లు నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 60.82 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4387 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.



## ఐపీఎల్‌లో బంగ్లాదేశ్ ఆటగాళ్లు

### విమర్శలపై స్పందించిన బీసీసీఐ..

ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో బంగ్లాదేశ్ ఆటగాళ్లను తీసుకోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో బీసీసీఐ వర్గాలు స్పందిం చాయి. బంగ్లాదేశ్ ఆటగాళ్లను ఐపీఎల్‌లో ఆడకుండా నిరోధించడంపై తమకు ప్రభుత్వం నుంచి ఎలాంటి మార్గనిర్దేశకాలు రాలేదని పేర్కొన్నాయి. ఇది తమ చేతుల్లో లేని వ్యవహారమని, దీనిపై ఇంతకుమించి మాట్లాడటానికి ఏమీ లేదని వెల్లడించాయి. ఐపీఎల్ 2026 మినీ వేలం డిసెంబర్ 15న యూఏఈ రాజధాని అబుదాబిలో జరిగింది. ఈ వేలంలో ముస్తాఫిజుర్ రెహమాన్‌ను కోల్‌కతా నైట్ రైడర్స్ రూ. 9.2 కోట్లకు దక్కించుకుంది. దాంతో ఐపీఎల్‌లో ఆడుతున్న అత్యంత ఖరీదైన బంగ్లాదేశ్ ఆటగాడిగా నిలిచాడు. రెహమాన్ 2016లో ఐపీఎల్‌లోకి ఎంట్రీ ఇచ్చాడు. 60 మ్యాచ్‌లాడి.. 65 వికెట్లు తీశాడు. కాగా.. పొరుగుదేశంలో రాజకీయ అస్థిరత వేళ.. మైనార్టీలపై దాడులు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే ఐపీఎల్‌లో బంగ్లాదేశ్ ఆటగాళ్లను తీసుకోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

### భారత్‌తో షెడ్యూల్ ప్రకటించిన బంగ్లా క్రికెట్ జట్టు..!

బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు తమ జట్టు ఆడే సిరీస్‌లపై ప్రకటన చేసింది. దౌత్య విభేదాల వేళ భారత్‌తో షెడ్యూల్‌ను కూడా ప్రకటించింది. భారత్‌తో ఆగస్టు–సెప్టెంబరు మధ్య మూడు వన్డేలు, మూడు టీ20 సిరీస్‌లు ఆడనున్నట్లు తెలిపింది. గత ఏడాది రెండు జట్ల మధ్య సిరీస్‌లు జరగాల్సి ఉండగా.. రాజకీయ ఉద్రిక్తతల కారణంగా నిరవధికంగా వాయిదా పడ్డాయి. ఈ ఆగస్టు టూర్‌తో అది భర్తీ కానుందని బీసీబీ వెల్లడించింది.

## రోహిత్, విరాట్ కోసం బీసీసీఐ

# మరిన్ని వన్డేలు నిర్వహించాలి

### ఇర్ఫాన్ పఠాన్

భారత సీనియర్ ప్లేయర్లు.. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ఏడాది పొడవునా ఆటలో కొనసాగడానికి, బీసీసీఐ మరిన్ని వన్డేలను షెడ్యూలు చేయాలని టీమ్‌ఇండియా మాజీ క్రికెటర్ ఇర్ఫాన్ పఠాన్ సూచించాడు. భారత జట్టు 2026లో తన తొలి వన్డేను జనవరి 11న న్యూజిలాండ్‌తో ఆడనుంది. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ఇప్పటికే.. టీ20, టెస్టు క్రికెట్‌కు వీడ్కోలు పలికిన విషయం తెలిసిందే. ప్రస్తుతం వారు కేవలం వన్డే క్రికెట్‌లోనే కొనసాగుతున్నారు. ఈ నేపథ్యంలో బీసీసీఐ అయిదు వన్డే మ్యాచ్‌ల సిరీస్‌లు, త్రైపాక్షిక సిరీస్‌లు ఎందుకు నిర్వహించడం లేదని ఇరాన్ పఠాన్ ప్రశ్నించాడు. 2027 వన్డే వరల్డ్‌కప్ వరకు రోహిత్, విరాట్‌కు తగినంత క్రికెట్ ఆడే అవకాశం కల్పించాలని సూచించాడు. 'మనం మూడు వన్డేల సిరీస్‌ల బదులు అయిదు వన్డేల సిరీస్‌లు ఎందుకు ఆడకూడదు. ఎందుకు త్రైపాక్షిక సిరీస్‌లు నిర్వహించడం లేదు. మంచి విషయం ఏంటంటే.. ఇప్పటికీ రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ అదుతే ప్రదర్శనలు చేస్తున్నారు. వరల్డ్ కప్ నేపథ్యంలో వారికి తగినంత మ్యాచ్ ప్రాక్టీస్ కల్పించాలి. ఒకవేళ అంతర్జాతీయ మ్యాచ్‌లు లేకపోతే వారు దేశవాళీ క్రికెట్‌లోనైనా వరుసగా మ్యాచ్‌లు ఆడాలి' అని ఇర్ఫాన్ పఠాన్ అన్నాడు. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ.. 2025లో లీడింగ్ రన్ స్కోరర్స్‌గా నిలిచారు. విరాట్ 13 ఇన్నింగ్స్‌ల్లో 65.10 యావరేజ్‌తో 651 పరుగులు చేశాడు. ఇందులో మూడు సెంచరీలు, నాలుగు అర్ధశతకాలున్నాయి. రోహిత్ శర్మ 14 ఇన్నింగ్స్‌ల్లో 50 యావరేజ్‌తో 650 రన్స్ సాధించాడు. ఇందులో రెండు సెంచరీలు, నాలుగు అర్ధశతకాలున్నాయి. విజయ్ హజారే ట్రోఫీలోనూ వీరు రాణించారు. ఢిల్లీ తరఫున కోహ్లీ ఒక సెంచరీ (131), ఒక హాఫ్ సెంచరీ (77), ముంబయి తరఫున రోహిత్ ఒక సెంచరీ (155) సాధించారు. టీమ్‌ఇండియా అయిదు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌ను చివరిసారిగా 2019లో ఆస్ట్రేలియాతో ఆడింది. అప్పటి నుంచి కేవలం మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లు మాత్రమే భారత జట్టు ఆడుతోంది. అలాగే చివరిసారిగా త్రైపాక్షిక సిరీస్‌లో 2015లో పాల్గొంది. ఆ సిరీస్‌లో ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా, భారత్ ఆడాయి. ఆ మ్యాచ్‌లు ఆస్ట్రేలియాలో జరిగాయి.






## ఆస్ట్రేలియా బ్యాటర్లు.. పుజారా, రహానేను ఆదర్శంగా తీసుకోవాలి

### రాబిన్ ఉతప్ప

టీమ్‌ఇండియా మాజీ క్రికెటర్ రాబిన్ ఉతప్ప ఆస్ట్రేలియా బ్యాటర్లకు ఆసక్తికరమైన సూచన చేశాడు. వారు బ్యాటింగ్‌లో ఛతేశ్వర్ పుజారా, అజింక్య రహానేను ఆదర్శంగా తీసుకోవాలని సూచించాడు. యాషెస్ సిరీస్‌లో భాగంగా ఇటీవల ముగిసిన నాలుగో టెస్ట్‌లో ఆస్ట్రేలియా నాలుగు వికెట్ల తేడాతో ఓటమి పాలైన విషయం తెలిసిందే. 15 సంవత్సరాల్లో తొలిసారిగా ఆస్ట్రేలియా సొంత గడ్డపై ఇంగ్లాండ్ చేతిలో ఓటమి పాలైంది. ఈ నేపథ్యంలో రాబిన్ ఉతప్ప ఆసీస్ బ్యాటర్లకు ఓర్పుగా, నేర్పుగా బ్యాటింగ్ చేయాలని సూచించాడు. 'మెల్‌బోర్న్ పిచ్ ఫాస్ట్ బౌలర్లకు అనుకూలించింది. అయితే ప్రస్తుతం క్రికెట్ ఆడే విధానం వల్లే ఇలా జరిగిందని నేను భావిస్తున్నాను. బ్యాటర్లకు సరైన నేర్పు, ఓర్పు, పోరాటతత్వం ఉంటే ఈ పిచ్ మీద కూడా రాణించవచ్చు. ఇది హై స్కోరింగ్ పిచ్ కాదని నాకు తెలుసు. దీనిమీద 300 పరుగులు చేయలేం. కానీ ప్రయత్నిస్తే 250 పరుగులు చేయడం సాధ్యమే. ఛతేశ్వర్ పుజారా, అజింక్య రహానేలా ఆడాలి. అప్పుడు కచ్చితంగా పరుగులు వస్తాయి' అని రాబిన్ ఉతప్ప తన యూట్యూబ్ ఛానల్ వేదికగా అన్నాడు. ఇంగ్లాండ్ బ్యాటర్ జోరూట్ కూడా పరిస్థితులకు అనుగుణంగా బ్యాటింగ్ చేయలేకపోయాడని ఉతప్ప వివరించాడు. 'నా మాటలు కాస్త కఠినంగా ఉండొచ్చు. కానీ, వాస్తవం ఏంటంటే.. మనం టెస్ట్ క్రికెట్ ఆడుతున్న విధానం ప్రస్తుతం పూర్తిగా మారిపోయింది. యాషెస్ టెస్ట్ మ్యాచ్‌లు రెండు రోజుల్లో ముగిసిపోతే పెద్దగా ఆసక్తి ఉండదు. జోరూట్ కూడా ఈ విషయంలో విఫలమయ్యాడు. రెండో ఇన్నింగ్స్‌లో.. అటాకింగ్ క్రికెట్ ఆడాలో.. లేక, తనదైన రీతిలో బ్యాటింగ్ చేయాలో తెలియక అతడు తికమకపడ్డాడు' అని రాబిన్ ఉతప్ప విశ్లేషించాడు. ఇప్పటికే ఆస్ట్రేలియా మొదటి మూడు టెస్టుల్లో విజయం సాధించి, యాషెస్ సిరీస్‌ను సొంతం చేసుకుంది. నాలుగో టెస్టులో ఇంగ్లాండ్ విజయం సాధించింది. చివరి టెస్ట్ మ్యాచ్ ఆదివారం (జనవరి 4న) సిడ్నీ వేదికగా ప్రారంభం కానుంది.

## పాక్ జట్టు కోచ్‌గా ఎందుకు

# వైదొలిగానంటే..: జేసన్ గిలెస్పీ



ఆస్ట్రేలియా మాజీ బౌలర్ జేసన్ గిలెస్పీ 2024లో పాకిస్థాన్ కోచ్‌గా పనిచేసిన విషయం తెలిసిందే. అయితే అతడు అకస్మాత్తుగా తన పదవి నుంచి తప్పుకున్నాడు. దానికి గల కారణాన్ని తాజాగా సోషల్ మీడియా వేదికగా వెల్లడించాడు. పాకిస్థాన్ జట్టును ఎందుకు వీడారని ఒక 'ఎక్స్' యూజర్ అడిగాడు. దానికి గిలెస్పీ బదులిచ్చాడు. 'అప్పుడు నేను పాకిస్థాన్ టెస్ట్ జట్టుకు కోచ్‌గా వ్యవహరిస్తున్నా. హెడ్ కోచ్‌నైన నాకు ఏమాత్రం సమాచారం ఇవ్వకుండానే పాకిస్థాన్ క్రికెట్ బోర్డ్ మా సీనియర్ అసిస్టెంట్ కోచ్‌ను తొలగించింది. అది ఏమాత్రం ఆమోదయోగ్యం కాదనిపించింది. అలాగే ఇలాంటి మరిన్ని అవమానకర పరిస్థితులు ఎదురయ్యాయి.' అని గిలెస్పీ వివరించాడు. స్థానికంగా ఉండి కూడా కనెక్షన్ క్యాంప్‌నకు హాజరుకాని పీసీబీ చీఫ్ నఖ్వీ గురించి కొంతకాలంక్రితం గిలెస్పీ మాట్లాడాడు. దక్షిణాఫ్రికా నుంచి గ్యారీ కిర్‌స్టన్, ఆస్ట్రేలియా నుంచి నేను విమానంలో పాక్‌కు వెళ్లాం. కానీ నఖ్వీ.. లాహోర్‌లోనే ఉండి కూడా హాజరు కాలేదన్నాడు. 'గ్యారీ కిరిస్టెన్.. కనెక్షన్ క్యాంప్ గురించి గొప్ప ఆలోచనలతో ముందుకువచ్చాడు. పాకిస్థాన్ క్రికెట్ జట్టులోని ప్రతిఒక్కరూ ఆ సమావేశంలో తమ అనుభవాలను పంచుకున్నారు. నేను ఆస్ట్రేలియా నుంచి, గ్యారీ దక్షిణాఫ్రికా నుంచి విమానంలో వచ్చాం. కానీ పీసీబీ ఛైర్మన్ నఖ్వీ మాత్రం జూమ్ ద్వారా మాతో మాట్లాడాడు' అని గిలెస్పీ వాపోయాడు. 'అతడు లాహోర్‌లోనే ఉన్నాడు.. కానీ రాలేదు. ఛైర్మన్ ఆ సమావేశానికి రావడానికి 20 నిమిషాలు కూడా డ్రైవ్ చేయలేకపోయాడని మా ఇద్దరికీ అనిపించింది. అది కొంచెం అసాధారణం' అని జేసన్ గిలెస్పీ విమర్శించాడు.

## ఐదేళ్ల తర్వాత ఆస్ట్రేలియా ఓపెన్‌లోకి..

### వీనస్ విలియమ్స్ రీఎంట్రీ



అమెరికా వెటరన్ స్టార్ వీనస్ విలియమ్స్ ఐదేళ్ల తర్వాత ఆస్ట్రేలియా ఓపెన్‌లో పునరాగమనం చేస్తున్నారు. జనవరిలో ప్రారంభం కానున్న ఈ టోర్నీ కోసం ఆమెకు ఇప్పటికే వైల్డ్‌కార్డ్ ఎంట్రీ లభించింది. ఏడుసార్లు గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ ఛాంపియన్ అయిన ఆమె.. కొన్ని రోజుల క్రితమే వివాహబంధంలోకి అడుగుపెట్టిన సంగతి తెలిసిందే. డెన్మార్క్‌కు చెందిన మోడల్, యాక్టర్ ఆండ్రియా ప్రెటిని పెళ్లి చేసుకున్నారు. జనవరి 18 నుంచి మెల్‌బోర్న్‌లో ఆస్ట్రేలియన్ ఓపెన్ ప్రారంభం కానుంది. ఈ ఓపెన్ మెయిన్ డ్రాలో తలపడనున్న పెద్ద వయస్కురాలు వీనసే కావడం గమనార్హం. ఇప్పుడు ఆమె వయసు 46 ఏళ్లు. అంతకుముందు ఈ రికార్డు జపాన్‌కు చెందిన కిమికో డేట్ పేరిట ఉండేది. "ఆస్ట్రేలియా ఓపెన్‌లో పునరాగమనం చేయడంపై సంతోషంగా ఉన్నాను. ఇక్కడ నాకు ఎన్నో జ్ఞాపకాలు ఉన్నాయి" అని వీనస్ సంతోషం వ్యక్తంచేశారు. 1998లో ఈ టోర్నమెంట్‌లో ఆమె అరంగేట్రం చేశారు. ఈ టోర్నీలో రెండుసార్లు సింగిల్స్ ఫైనల్‌కు చేరిన ఆమె.. 2003, 2017లో తన చెల్లెలు సెరెనా విలియమ్స్ చేతిలో ఓడి, రన్నరప్‌గా నిలిచారు.




## 90 రోజులు పనిచేస్తే గిగ్‌వర్కర్లకు సామాజిక భద్రత

### కేంద్రం డ్రాఫ్ట్ రూల్స్

గిగ్‌వర్కర్లకు సామాజిక భద్రత కల్పనకు సంబంధించి కేంద్రం ముసాయిదా నిబంధనలను విడుదల చేసింది. ఈ ప్రయోజనాలు పొందాలంటే ఒక ఆర్థిక సంవత్సరంలో గిగ్‌వర్కర్లు ఒక అగ్రిగేటర్ వద్ద కనీసం 90 రోజులు.. ఒకటి కంటే ఎక్కువ అగ్రిగేటర్ల వద్ద 120 రోజులు పనిచేయాల్సి ఉంటుంది. మెరుగైన వేతనాలు, సామాజిక భద్రత వంటి డిమాండ్లతో గిగ్ వర్కర్లు గత నెల రెండుసార్లు సమ్మెకు దిగిన వేళ కేంద్రం ఈ ముసాయిదా నిబంధనలు తీసుకురావడం గమనార్హం. ఒకరోజు అగ్రిగేటర్ వద్ద పనిచేస్తే.. వచ్చిన ఆదాయంతో సంబంధం లేకుండా దానిని ఒకరోజు కింద పరిగణనలోకి తీసుకుంటారు. ఒకవేళ ఒక గిగ్ వర్కర్ ఒకే రోజు ముగ్గురు అగ్రిగేటర్ల వద్ద పనిచేస్తే.. దానిని మూడు రోజులుగా పరిగణిస్తారు. అలాగే నేరుగా లేక పరోక్షంగా అగ్రిగేటర్‌తో కలిసి పనిచేసే వారిని గిగ్ వర్కర్‌గా గుర్తిస్తామని కేంద్రం పేర్కొంది. అసంఘటిత కార్మికులకు జాతీయ డేటాబేస్‌గా పరిగణిస్తున్న ఇ-శ్రమ్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్నవారికే సామాజిక భద్రత ప్రయోజనాలు అందుతాయని పేర్కొంది. కార్మికశాఖ ఇప్పటికే రిజిస్ట్రేషన్లను ప్రారంభించింది. ఇందులో నమోదు చేసుకున్నవారికి ఫొటోగ్రాఫ్, ఇతర వివరాలతో కూడిన ఐడీ కార్డు జారీ చేస్తారు. ఎప్పటికప్పుడు తమ వివరాలను ఇందులో అప్‌డేట్ చేసుకోవాల్సి ఉంటుంది. ప్రజాభిప్రాయ సేకరణ నిమిత్తం ముసాయిదాను డిసెంబర్ 30నే ప్రభుత్వం విడుదల చేసింది. ఇదిలాఉంటే.. డిసెంబర్ 25, 31 తేదీల్లో దేశవ్యాప్తంగా గిగ్ వర్కర్లు సమ్మె చేపట్టారు. ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ యాప్ బేస్డ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్, తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫామ్ వర్కర్స్ యూనియన్ పిలుపు మేరకు ఈ సమ్మె జరిగింది. 10 నిమిషాల్లో డెలివరీని పూర్తిగా రద్దు చేయాలని యూనియన్ నేతలు డిమాండ్ చేశారు.

## 10 నిమిషాల్లో డెలివరీ ప్రమాదకరమా?

### జొమాటో సీఈఓ పోస్ట్ వైరల్




పని పరిస్థితులు, సామాజిక భద్రత వంటి అంశాలతో డిసెంబరు 31న గిగ్ వర్కర్లు చేపట్టిన సమ్మెతో 'క్విక్ డెలివరీ'ల అంశం మరోసారి చర్చకు వచ్చింది. కొత్త సంవత్సరం వేళ ఆర్డర్లపై వీరి సమ్మె పెద్దగా ప్రభావం చూపించనప్పటికీ.. 10-మినిట్స్ డెలివరీ మోడల్ వల్లే రైడర్లు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని సామాజిక మాధ్యమాల్లో కామెంట్ల వర్షం కురిసింది. దీనిపై తాజాగా జొమాటో సీఈఓ దీపిందర్ గోయల్ స్పందిస్తూ.. '10 నిమిషాల్లో డెలివరీ' విధానంపై సుదీర్ఘ వివరణ ఇచ్చారు. ఇది సురక్షితమేనని, డెలివరీ పార్ట్‌నర్ భద్రతతో తాము రాజీపడట్లేదని వెల్లడించారు. "ఇళ్ల చుట్టుపక్కల దుకాణాలు పెరగడం వల్లే మేం 10 మినిట్స్ డెలివరీ విధానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చాం. అంతేగానీ, డెలివరీ పార్ట్‌నర్ వేగంగా డ్రైవ్ చేయాలనేది మా ఉద్దేశం కాదు. అసలు డెలివరీ కోసం కస్టమర్‌కు మేం ప్రామిస్ చేసిన టైమర్ రైడర్‌కు యాప్‌లో కన్పించదు. బ్లింకిట్‌లో ఆర్డర్ ఇచ్చిన 2.5 నిమిషాల్లో ఆ వస్తువులను మేం ప్యాక్ చేస్తాం. ఆ తర్వాత రైడర్ ప్రతి 8 నిమిషాలకు 2 కిలోమీటర్ల చొప్పున సగటున గంటకు 15 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తారు. క్విక్ డెలివరీల కోసం మా వ్యవస్థను అర్థం చేసుకోకపోవడం వల్లే చాలామంది ఈ విధానాన్ని రిస్క్ అని భావిస్తారు. బహుశా ఈ వ్యవస్థలో లేకపోతే.. నేను కూడా గిగ్‌వర్కర్లను దోచుకుంటున్నా రనే భావించేవాడిని. కానీ అది నిజం కాదు. మా మాధ్యమంపై పనిచేసేం దుకు చాలామంది స్వఛ్ఛందంగా ముందుకొస్తున్నారు. రెగ్యులర్ ఉద్యోగాలు చేయాలనుకుంటున్నారు. ఈ వ్యవస్థ ఎలాంటిదో వారిని అడగండి. అంతేగానీ.. సోషల్ మీడియాలో జరిగే ప్రచారాన్ని విశ్వసించకూడదు" అని దీపిందర్ గోయల్ రాసుకొచ్చారు. తమ సంస్థలో డెలివరీ పార్ట్‌నర్లకు భద్రత కల్పిస్తున్నామని, ప్రతి ఒక్కరికీ వైద్య, జీవిత బీమా అందిస్తున్నామని జొమాటో సీఈఓ వెల్లడించారు. ఇక, డిసెంబరు 31 నాటి గిగ్ వర్కర్ల సమ్మె గురించి ప్రస్తావిస్తూ.. "ఆ రోజున జొమాటో, బ్లింకిట్ రికార్డు స్థాయిలో డెలివరీలు చేశాయి. దాదాపు 4.5లక్షల మంది డెలివరీ పార్ట్‌నర్లు 75 లక్షలకు పైగా (ఆల్‌టైమ్ గరిష'ం) ఆర్డర్లు చేశారు. ఏ రైడర్‌కు అదనపు ప్రోత్సాహకాలు ఇవ్వకుండానే ఇది సాధ్యమైంది. ఇందుకు సహకరించిన ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు" అని పేర్కొన్నారు. చెల్లింపులు పెంచాలని, మెరుగైన పని పరిస్థితులు కల్పించాలని కోరుతూ దేశవ్యాప్తంగా పలువురు గిగ్ వర్కర్లు డిసెంబరు 31న సమ్మె నిర్వహించిన సంగతి తెలిసిందే. దాదాపు 1.7 లక్షల మంది వర్కర్లు ఇందులో పాల్గొన్నారు. అయితే, న్యూఇయర్ వేళ ఈ సమ్మె ప్రభావాన్ని తగ్గించేందుకు ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్‌లు ప్రోత్సాహకాలు ప్రకటించినట్లు వార్తలు వచ్చాయి. దీన్ని జొమాటో సీఈఓ తన పోస్ట్‌తో ఖండించారు.

www.rajamudranews.com
అక్షర రాజముద్ర
ప్రతి అక్షరం - ప్రజల కోసం తెలుగు దిన పత్రిక



# మనశంకరవరప్రసాద్ ట్రైలర్ 4న విడుదల




మెగాస్టార్ చిరంజీవి అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'మన శంకరవరప్రసాద్ గారు' ట్రైలర్ అప్‌డేట్ వచ్చేసింది. ఈ సినిమా ట్రైలర్‌ను జనవరి 4న విడుదల చేయబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ సందర్భంగా కొత్త పోస్టర్‌ను పంచుకుంది. సంక్రాంతికి వస్తున్నాం వంటి బ్లాక్ బస్టర్ తర్వాత అనిల్ రావిపూడి దర్శకత్వంలో ఈ సినిమా రాబోతుండగా.. మెగాస్టార్ చిరంజీవి, నయనతార ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. విక్టరీ వెంకటేశ్ కీలక పాత్రలో కనిపించబోతున్నాడు. ఈ చిత్రం సంక్రాంతి కానుకగా జనవరి 12న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఇప్పటికే సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి.

# సంయుక్త మీనన్.. ది బ్లాక్ గోల్డ్

ది బ్లాక్ గోల్డ్' సినిమాతో ప్రేక్షకుల్ని పలకరించనుంది సంయుక్తా మీనన్.. ఇది ఆమె చేస్తున్న తొలి నాయికా ప్రాధాన్య చిత్రం. యోగేశ్ కేఎంసీ తెరకెక్కిస్తున్నారు. రాజేశ్ దండా నిర్మిస్తున్నారు. మురళీ శర్మ, రావు రమేశ్, నాజర్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమా ఈ వేసవిలో తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో విడుదల కానుంది. ఈ విషయాన్ని కొత్త ఏడాది సందర్భంగా గురువారం ప్రకటించారు. ఈ మేరకు ఓ కొత్త పోస్టర్‌ను పంచుకున్నారు. 'ఊహించని మలుపులతో సాగే సరికొత్త కథతో.. అద్భుతమైన యాక్షన్ సన్నివేశాలతో ఈ సినిమా అందర్నీ అలరించేలా ఉండనుంది. సంయుక్త దీంట్లో శక్తిమంతమైన పోలీసు పాత్రలో కనిపించనుంది. ఇప్పటికే 75శాతం చిత్రీకరణ పూర్తయింది. మరో 15రోజుల చిత్రీకరణెళ మిగిలి ఉంది. నిర్మాణానంతర పనులు శరవేగంగా జరుగుతున్నాయి. త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తాం' అని చిత్ర వర్గాలు తెలిపాయి. ఈ సినిమాకి సంగీతం: సామ్ సీఎస్, ఛాయాగ్రహణం: ఎ వసంత్.

# ది కేరళ స్టోరీ-2కు ప్లాన్




ఎన్నో వివాదాలు, విమర్శల మధ్య విడుదలై బాక్సాఫీసు వద్ద మంచి వసూళ్లను సొంతం చేసుకుంది 'ది కేరళ స్టోరీ' చిత్రం. అదా శర్మ కథానాయికగా నటించింది. కేరళలో కొన్నేళ్లుగా మహిళలు అదృశ్యమైనట్లు వస్తోన్న ఆరోపణలకు సంబంధించి వారి ఆచూకీ ఎక్కడనే ఇతివృత్తంతో సుదీప్తో సేన్ దీన్ని తెరకెక్కించారు. పలు పురస్కారాలను సొంతం చేసుకున్న ఈ చిత్రానికి ఇప్పుడు సీక్వెల్‌గా 'ది కేరళ స్టోరీ 2' రాబోతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే చిత్రీకరణ కూడా పూర్తయినట్లు సమాచారం. ఈ సీక్వెల్ మరింత భయంకరమైన చీకటి కథను ప్రదర్శిస్తుంది. నిర్మాత విపుల్ అమృత్‌లాల్ షా చిత్రీకరణ సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కఠినమైన భద్రతను పాటించారు. ఈ కొనసాగింపు చిత్రాన్ని ఫిబ్రవరి 27న థియేటర్లలోకి తీసుకురావాలని విడుదల తేదీని కూడా ఖరారు చేశారు. త్వరలో అధికారికంగా ప్రకటించనున్నారని చిత్ర సన్నిహిత వర్గాలు తెలిపాయి.

# అడ్వాన్స్ బుకింగ్స్‌లో విజయ్ 'జన నాయగన్' దూకుడు..

హైదరాబాద్: విజయ్ కథానాయకుడిగా హెచ్.వినోద్ దర్శకత్వంలో రూపొందుతున్న పొలిటికల్ యాక్షన్ థ్రిల్లర్ 'జన నాయగన్'. సంక్రాంతి కానుకగా జనవరి 9న ఈ చిత్రం తమిళ, తెలుగు, హిందీ భాషల్లో విడుదల కానుంది. ఇప్పటికే తమిళ వెర్షన్‌కు సంబంధించి ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల్లో అడ్వాన్స్ బుకింగ్స్ ఓపెన్ అయ్యాయి. వీటిద్వారా ఇప్పటివరకూ రూ.15 కోట్లు వచ్చినట్లు ట్రేడ్ వర్గాలు అంచనా వేశాయి. విజయ్ నటిస్తున్న చివరి సినిమా కావడంతో దీనిపై భారీ అంచనాలు ఉన్నాయి. తెలుగులో విజయవంతమైన 'భగవంత్ కేసరి'కి రీమేక్‌గా దీన్ని తీర్చిదిద్దుతున్నారని ఎప్పటినుంచో ప్రచారం జరుగుతోంది. అయితే, దీనిపై ఇప్పటివరకూ ఎలాంటి ప్రకటనా వెలువడలేదు. ఈ క్రమంలో దర్శకుడు హెచ్.వినోద్ స్పందించారు. 'నేను ఈ విషయాన్ని ధ్రువీకరించను. అలాగే కొట్టిపారేయను. ఇంతకుముందు కూడా మీకు ఈ విషయం చెప్పాను. ఇది దళపతి మూవీ. ఇది రీమేకా..? ఏదైనా చిత్రం నుంచి స్ఫూర్తిపొంది తీశారా? అన్న విషయంపై ప్రేక్షకులు ఆందోళనపడాల్సిన అవసరం లేదు. వచ్చి సినిమా చూడండి' అని అన్నారు. జనవరి 3న ఈ మూవీకి సంబంధించిన ట్రైలర్ విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం ప్రకటించింది. అది వస్తే చాలా విషయాల్లో స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ఈ చిత్రానికి అనిరుధ్ సంగీత దర్శకుడిగా వ్యవహరిస్తున్నారు.



# టైగర్ ష్రాఫ్‌తో జతకట్టనున్న కృతిశెట్టి

అందాల తార కృతి శెట్టి.. బాలీవుడ్‌లోకి అడుగుపెట్టనుందా? అంటే అవుననే అంటున్నాయి సినీ వర్గాలు. హిందీ యాక్షన్ హీరో టైగర్ ష్రాఫ్‌తో దర్శకుడు మిలాప్ జవేరి ఓ చిత్రం కోసం చేతులు కలిపినట్లు కొన్ని రోజులుగా వార్తలు వస్తోన్న సంగతి తెలిసిందే. తాజాగా ఇందులో కథానాయికగా కృతి శెట్టిని ఎంపిక చేసిందట చిత్రబృందం. 'ప్రముఖ నిర్మాణ సంస్థ టీ-సిరీస్ దీన్ని భారీ బ్జడెట్‌తో రూపొందించాలని నిర్ణయించుకుంది. జనవరిలో ముంబయిలో చిత్రీకరణ ప్రారంభం కానున్న ఈ సినిమాలో టైగర్ సరసన నటించడానికి కృతి ఇప్పటికే గ్రీన్ సిగ్నల్ ఇచ్చేసింది. ఇదే ఆమెకు తొలి హిందీ చిత్రం కావడం విశేషం. యాక్షన్ థ్రిల్లర్‌గా తీర్చిదిద్దుతున్న ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది ద్వితీయార్థంలో విడుదల చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. త్వరలో దీనిపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశాలున్నాయ'ని కృతి సన్నిహిత వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం ఆమె నటించిన 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ', 'వా వాతియార్' విడుదలకు సిద్ధంగా ఉన్నాయి.



# జడల్ జమానా ఇది

'దసరా' విజయం తర్వాత కథానాయకుడు నాని.. దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కలయికలో రూపొందుతున్న బహు భాషా చిత్రం 'ది ప్యారడైజ్'. సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు. మోహన్‌బాబు ప్రతినాయకుడిగా నటిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉన్న ఈ సినిమా నుంచి కొత్త ఏడాది సందఠరేగా ఓ కొత్త లుక్‌ను విడుదల చేశారు. "జడల్ జమానా" అంటూ వచ్చిన ఆ ప్రచార చిత్రంలో నాని యాక్షన్ లుక్‌లో ఆకట్టుకునేలా కనిపించారు. పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా ముస్తాబవుతున్న ఈ సినిమా మార్చి 26న థియేటర్లలోకి రానుంది. ఈ చిత్రానికి అనిరుధ్ సంగీత దర్శకుడిగా వ్యవహరిస్తున్నారు.

# విశ్వక్ సేన్ కొత్త మూవీ లెగసీ




టాలీవుడ్ యంగ్ అండ్ డైనమిక్ హీరో, మాస్ కా దాస్ విశ్వక్ సేన్ మరో విలక్షణమైన కథతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఆయన నటిస్తున్న తాజా చిత్రం 'లెగసీ'. ప్యూర్ పొలిటికల్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ సినిమా టీజర్‌ను మేకర్స్ తాజాగా విడుదల చేశారు. పాలిటిక్స్ ఈజ్ పర్సనల్ అనే పవర్‌ఫుల్ ట్యాగ్‌లైన్‌తో వచ్చిన ఈ టీజర్ ప్రస్తుతం సోషల్ మీడియాలో సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది. టీజర్ ప్రారంభం నుండి ముగింపు వరకు చాలా ఇంటెన్స్‌గా సాగింది. ముఖ్యంగా విశ్వక్ సేన్ చెప్పిన డైలాగులు పొలిటికల్ హీట్‌ను పెంచుతున్నాయి: రాజకీయమంటే పులిమీద సవారీ లాంటిదంటారు.. ఆ పులి మీద నాయకుడు ఒక్కడే కూర్చోవాలా? ఆ కుటుంబం మొత్తం కూర్చోవాలా?దిస్ ఈజ్ యాన్ ఇంటర్నల్ వార్ ఫర్ రియల్ లెగసీ ఈ డైలాగ్స్ చూస్తుంటే, అధికారం కోసం ఒకే కుటుంబంలో జరిగే అంతర్గత పోరు, వారసత్వ రాజకీయాల చుట్టూ ఈ కథ తిరుగుతుందని స్పష్టమవుతోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా విశ్వక్ సేన్ ఈ సినిమాలో ఒక సీరియస్ పొలిటీషియన్ పాత్రలో కనిపిస్తుండటం విశేషం. ఈ చిత్రానికి సాయికిరణ్ రెడ్డి దైడా దర్శకత్వం వహిస్తున్నారు. భారీ తారాగణంతో రూపొందుతున్న ఈ సినిమాలో ఏక్తా రాథోడ్ హీరోయిన్‌గా నటిస్తుండగా.. రావు రమేశ్, సచిన్ ఖేడ్కర్, మురళీ మోహన్, కేకే మేనన్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. కలాహి మీడియా ప్రొడక్షన్స్ బ్యానర్‌పై యశ్వంత్ దగ్గుమటి, సాయికిరణ్ రెడ్డి దైడా నిర్మిస్తున్నారు.

Printed, Published and Owned by **RAVU RAJITHA**, Printed at **KAKATHIYA PRINTERS**, LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY**. **RAJAMUDRA PUBLICATIONS**, Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684**, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com